TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

శుక్రవారం, అక్టోబర్ 09, 2026 | సంపుటి - 21 | సంచిక 01 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

1045.46 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

371 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

న్యూఢిల్లీ : భారత ఈక్విటీ మార్కెట్లు గురువారం భారీ అమ్మకాల ఒత్తిడితో కుప్ప కూలాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భగ్గుమనడం, వడ్డీ రేట్లు దీర్ఘకాలం పాటు అధిక స్థాయిలోనే కొనసాగుతాయనే ఆందోళనలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల తరలింపు వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. 2లో

బీసీలే మా వెన్నెముక

బీసీ రిజర్వేషన్లలో రాజీ లేదు

34 శాతంకు కట్టుబడి ఉన్నాం

మంత్రి నారా లోకేశ్ వెల్లడి

అమరావతి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ మంత్రి నారా లోకేశ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళతామని తెలిపారు. ఈరోజు ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

గోదావరి-కావేరి లింక్‌పై కీలక ప్రతిపాదనలు!

- ప్రధాని ఒమోదీతో సీఎం చంద్రబాబు భేటీ..
- ప్రాజెక్టులకు సహాయం అందించాలని విజ్ఞప్తి
- రాష్ట్ర అభివృద్ధిపై ప్రధానితో కీలక చర్చలు
- పోలవరం, గోదావరి పుష్కరాలపై చర్చ
- ఎల్‌నినో ప్రభావాన్ని వివరించిన సీఎం
- నదుల అనుసంధానంపై ప్రతిపాదనలు
- పోర్టుల అభివృద్ధికి 20 వేల ఎకరాలివ్వండి
- 20,378 ఎకరాల భూములు కేటాయించాలి
- పంటల ఎగుమతులకు సహకరించాలి
- పీయూష్ గోయల్‌తో సిఎం చంద్రబాబు భేటీ
- మౌలిక వసతుల ప్రాజెక్టులకు సహకరించండి
- ఓఆర్ఆర్, పోలవరం బ్రిడ్జికి అనుమతివ్వండి
- ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి సహకరించండి
- పోలవరంవద్ద ఐకానిక్ వంతెనకు నిధులివ్వండి
- బీచ్ రోడ్ ప్రాజెక్టుపై కేంద్రం దృష్టి సారించాలి
- మంత్రి నితిన్ గడ్కరీతో భేటీలో సిఎం వినతి
- కేంద్రానికి సిఎం చంద్రబాబు పలు విజ్ఞప్తులు

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక పరిస్థితి, నీటిపారుదల, మౌలిక వసతులు, కరువు పరిస్థితులు సహా పలు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గోదావరి--కావేరి నదుల అనుసంధానాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. భేటీ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా మోదీ అందించిన సేవలను ప్రస్తావిస్తూ.. దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వం, సుపరిపాలనతో దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 2లో

ధర్మేంద్ర ప్రధాన్‌కు ఏం జరిగిందో

ప్రధాని మోదీకి అదే జరుగుతుంది

సీఈసీకి వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన నిరసనలో సీఎం రేవంత్

న్యూఢిల్లీ :

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం సీఈసీకి వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన నిరసనలో పాల్గొన్న రేవంత్.. బీజేపీ తీరును తీవ్రంగా విమర్శించారు. 'మొదట మతాన్ని, భాషను ఉపయోగించుకుని ప్రధాని మోదీ నెగ్గేందుకు ప్రయత్నించారు. ఆ తరువాత ఈడీ, సీబీఐ సంస్థలను ఉపయోగించి గెలిచేందుకు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ఈ ప్రయోగాలు చెల్లవని 13 కోట్ల ఓట్లు తొలగించి మళ్లీ అధికారం చేపట్టాలనుకుంటున్నారు' అని ఆయన మండిపడ్డారు. బ్రిటీషర్స్ సైమన్ కమిషన్ వాడితే, బీజేపీ ఎన్నికల కమిషన్ వాడుతోందని ఆరోపించారు. నాడు భగత్ సింగ్ పోరాటం చేస్తే నేడు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. బలహీన వర్గాల వారి ఓట్లను కాపాడటమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఓట్ల తొలగింపు కాంగ్రెస్ సమస్య కాదని దేశ ప్రజల సమస్య అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పంతాలకు పోకుండా వెంటనే స్పందించాలన్నారు. లేకపోతే ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో ఏం జరిగిందో ప్రధాని మోదీ విషయంలో కూడా అదే జరుగుతుందని హెచ్చరించారు. అక్రమ ఓట్ల తొలగింపు ద్వారా రెండు రకాల పౌరులు ఏర్పడుతున్నారని రేవంత్ వివరించారు. ఓటు ఉన్నవారు ఓటు లేని వారిని ద్వితీయ పౌరులుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.ఖు

లోక్‌భవన్ వద్ద ఉద్రిక్తత

మహేశ్ గౌడ్, మంత్రుల అరెస్ట్

హైదరాబాద్, అక్టోబర్ 8:

లోక్‌భవన్ వద్ద ఆందోళనకు దిగిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు(గురువారం) 'ఛలో లోక్‌భవన్'కు కాంగ్రెస్, టీజేఎస్, లెఫ్ట్ పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ నిరసనలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఇండియా కూటమి రాష్ట్ర నేతలు పాల్గొని ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఖైరతాబాద్ నుంచి లోక్‌భవన్ వైపు ర్యాలీగా బయలుదేరిన నేతలను అడ్డుకున్నారు. లోక్‌భవన్‌కు 300 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. లోక్‌భవన్ వైపుకు రానీయకుండా ఆందోళనకారులను బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ర్యాలీని అడ్డుకున్న పోలీసులపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆందోళనకు దిగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు దేశవ్యాప్తంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి.

రాష్ట్రంలో మండుతున్న ఎండలు

పలు ప్రాంతాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు..!

రాష్ట్రంలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతున్నది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండల మంటలు, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇవాళ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా.. భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావంవల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టంచేశారు.

జూరాల కాలువకు నీరొదిలిన

రైతులపై కేసు

- 14 మంది అన్నదాతలపై ఎఫ్ఐఆర్ నమోదు
- ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన పాలన
- అందుకే రైతులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళన
- రైతులపై కేసులు పెట్టడం హేయమైన చర్య
- రైతులపై కేసుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

హైదారాబాద్ : జూరాల ఎడమగట్టు కాలువ నుంచి నీటిని విడుదల చేసుకున్న రైతులపై అమరచింత పోలీసులు కేసు నమోదు చేశారు. జూరాల ప్రాజెక్టు అధికారుల ఫిర్యాదుతో 14 మంది రైతులపై ఎఫ్?ఐఆర్ దాఖలు చేశారు. పంటలు ఎండుతున్నందున కాలువలకు నీటిని విడుదల చేయాలంటూ గత నెలలో స్థానిక గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో సెప్టెంబర్ 19న ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్? ధ్వంసం చేసి బలవంతంగా నీటిని విడుదల చేసుకున్నారు. దీంతో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు అధికారుల విధులకు ఆటంకం కలిగించారంటూ ప్రాజెక్ట్ నీటి పారుదల శాఖ డిప్యూటీ తరువాయి 2లో

కొత్త ఓటు కోసం భారీగా దరఖాస్తులు

- 4.88 లక్షల అప్లికేషన్లు నమోదు
- ఫామ్-6 దరఖాస్తులు అందజేత
- ఫారం-7 దరఖాస్తు గణాంకాలు వెల్లడి
- వంబర్ 9న వెలువడే తుది జాబితా
- ఓటర్ల సంఖ్యపై రానున్న స్పష్టత

హైదారాబాద్ : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొత్త ఓటు కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫామ్-6 దరఖాస్తులు అందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అలాగే విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి 6,270 ఫామ్-6ఏ దరఖాస్తులు వచ్చాయి. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలు వంటి అంశాల కోసం 5,04,782 ఫామ్-8 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనల కోసం ఫామ్-7లు కూడా వేల సంఖ్యలో వచ్చాయి.ఫామ్-7 ద్వారా ఇప్పటికే ఉన్న

జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమీవుల్లా అమరచింత ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఖఖూఆరేపల్లి, మూలమల్ల, క్యాతెపల్లి తదితర గ్రామాల రైతులు భారీగా గుమిగూడి జూరాల ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ యాక్సెస్ డోర్లు, సెక్యూరిటీ ఫాస్టెనింగ్?లు సైతం పగులగొట్టినట్లు డీఈఈ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్?లోకి అనుమతి లేకుండా చొరబడి లెఫ్ట్ కెనాల్ గేట్లను బలవంతంగా ఎత్తి, నీటిని విడుదల చేయడంతో దాని స్క్రూరాడ్లు వంగిపోయినట్లు తెలిపారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేసినందుకు కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఈ తన ఫిర్యాదులో వెల్లడించారు. ఈ మేరకు ప్రాపర్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై పార్వతి తెలిపారు. అలాగే జూరాల ప్రాజెక్టు నుంచి నీరు వదలాలంటూ సెప్టెంబర్ 21న నిరసన చేపట్టిన బీఆర్?ఎస్, బీజేపీ నేతల పైన కూడా కేసులు నమోదయ్యాయి. మరోవైపు తెలంగాణలో జూరాల సాగునీటి అంశం మరోసారి తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయంటూ జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వనపర్తి జిల్లా పరిధిలోని జూరాల కాలువకు నీటిని విడుదల చేసుకున్న 14 మంది రైతులపై కేసులు నమోదైనట్లు అమరచింత ఎస్సై స్వాతి వెల్లడించారు. ప్రాజెక్టు ఇరిగేషన్ డీఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రైతులపై కేసులు నమోదు చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. పంటలు ఎండిపోతుంటే సాగునీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడం సరికాదని విమర్శించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ రైతులు, వివిధ పార్టీల నాయకులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులను నీటిని విడుదల చేయాలని కోరినా స్పందన లేకపోవడంతో సెప్టెంబర్ 19వ తేదీన సాయంత్రం కొందరు రైతులు స్వయంగా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 19, 20వ తేదీల్లో జరిగిన ఆందోళనలకు సంబంధించి కేసులు నమోదు అయ్యాయి. జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపైనా కేసులు నమోదు చేశారు. రైతులపై కేసులు నమోదు చేయడంపై హరీశ్‌రావు తన ఎక్స్ అకౌంట్ ద్వారా స్పందించారు. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే వాటిని కాపాడుకునేందుకు జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. 'కళ్ల ముందే ఎండుతున్న పంటలకు జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళన బాట పట్టిన రైతులపై కేసులు నమోదు చేయడం అత్యంత హేయమైన చర్య' అని హరీశ్‌రావు ట్వీట్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారిందని హరీశ్ రావు ఆరోపించారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే కడుపు మండిన రైతులు రోడ్డెక్కి ప్రశ్నిస్తే వారిపై కేసులు ఎలా పెడతారని ఆయన నిలదీశారు. జూరాల నీటిని విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ఇంజినీర్లతో రైతులపై కేసులు పెట్టించడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు ఉన్న సమయంలో నీటిని లిఫ్ట్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని హరీశ్‌రావు ఆరోపించారు. నీటిని సద్వినియోగం చేసుకోకుండా వదిలేయడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని ఆయన అన్నారు. 'తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సాగునీరు, విద్యుత్ సమస్యలపై రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కేసులు పెట్టడం సరికాదన్నారు. 'ఇది ప్రజా పాలననా.. లేక ప్రజా పీడననా?' అంటూ హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ఇదే వైఖరిని కొనసాగిస్తే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జూరాల ఆయకట్టు రైతులపై కేసులు నమోదు చేయడాన్ని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి కూడా ఖండించారు. జూరాల డ్యాం వద్ద ఉద్రిక్త పరిస్థితులకు ప్రభుత్వ వైఖరే కారణమని ఆయన విమర్శించారు. కృష్ణా జలాలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే రైతులు ఆందోళనకు దిగాల్సి వచ్చిందని లక్ష్మారెడ్డి ఆరోపించారు. పంటలు ఎండిపోతుంటే రైతులు ఆవేదనతో ధర్నా చేస్తే వారిపై కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

సూచీలు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1045.46 పాయింట్లు (1.44%) పతనమై 71,593.24 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 371.25 పాయింట్లు (1.64%) నష్టపోయి 22,231.80 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర ఏకంగా 4% పెరిగి బ్యారెల్‌కు 104 డాలర్ల మార్కును దాటడం మార్కెట్లలో భయాందోళనలకు ప్రధాన కారణమైంది. ఇది ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను మరింత పెంచుతుందనే ఆందోళనలు రేకెత్తించింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 22,179.90 వరకు పడిపోయి, 2026 సంవత్సరంలోనే అత్యంత కనిష్ట స్థాయిని నమోదు చేసింది. టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ కీలకమైన మద్దతు స్థాయిలను కోల్పోయిందని, ఇప్పుడు 22,000 పాయింట్ల మానసిక మద్దతు స్థాయిపై దృష్టి కేంద్రీకృతమైందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ సూచీ కోలుకోవడానికి ప్రయత్నిస్తే 22,400, ఆ తర్వాత 22,600 వద్ద ప్రతిఘటన ఎదుర్కోవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాల్లోనూ కనిపించింది. మెటల్ రంగ షేర్లు అత్యధికంగా నష్టపోగా, ఐటీ రంగం మాత్రం కొంతమేర తట్టుకుని నిలబడింది. సెన్సెక్స్-30 షేర్లలో టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్ మాత్రమే లాభపడగా.. ఐటీసీ, ఇండిగో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్టీపీసీ, మారుతి సుజుకీ వంటి దిగ్గజాలు కూడా నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.53%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.34% చొప్పున పడిపోయాయి. రానున్న రోజుల్లో మార్కెట్ దృష్టి క్యూ2 (రెండో త్రైమాసికం) ఫలితాలపైకి మళ్లనుంది. డిమాండ్ స్థిరత్వం, ముడిసరుకుల వ్యయాల నిర్వహణపై కంపెనీల యాజమాన్యాలు చేసే వ్యాఖ్యలు సమీప భవిష్యత్తులో మార్కెట్ గమనాన్ని నిర్దేశించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

రామగుండంలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

ఈనెల 14న నిర్వహించేందుకు భారీ ప్లాన్

హైదరాబాద్, అక్టోబర్ 08 : సింగరేణి బొగ్గు గని కార్మికుల సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని.. అందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నెల 14వ తేదీన రామగుండంలో ' సింగరేణి కార్మిక గర్జన ' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ప్రతినిధులతో హరీశ్‌రావు సమావేశమై మాట్లాడారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి.. సంస్థ ఆర్థిక పరిస్థితి, కార్మికుల సమస్యలు, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై వారితో హరీశ్ రావు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సింగరేణి సంస్థ లాభాల్లో కార్మికులకు రావాల్సిన వాటాను పూర్తిగా చెల్లించాలని హరీశ్‌రావు ప్రధానంగా డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన కార్మిక కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని, క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని కోరారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని.. సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కూడా హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గిందంటూ హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తన వాదనకు సంబంధించి 2023-24లో 70 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పత్తి.. 2025-26లో 58 మిలియన్ టన్నులకు తగ్గిందని పేర్కొన్నారు. పరిపాలనా నిర్ణయాలు, టెండర్లు, కాంట్రాక్టు వ్యవహారాల కారణంగానే ఉత్పత్తి తగ్గిందని ఆయన ఆరోపించారు. సింగరేణి కార్మికుల ఇళ్ల హక్కుల అంశాన్ని కూడా ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 76 కింద మిగిలిన అర్హులైన కార్మికులకు సేల్ డీడ్‌ల ద్వారా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి సంస్థకు సంబంధించిన ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకిస్తామని తెలిపారు. రామగుండంలో జరగనున్న ఈ సభ ద్వారా సింగరేణి కార్మికుల సమస్యలను రాష్ట్రస్థాయిలో మరింతగా ప్రస్తావించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు, సభకు పెద్ద సంఖ్యలో కార్మికులు, సింగరేణి ప్రాంత ప్రజలు తరలివచ్చేలా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 14వ తేదీన సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని జీఎం కార్యాలయ మైదానంలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

వ్యాపారులకు భారీ ఊరట

పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు

ప్రాసిక్యూషన్ పరిమితి రూ. 5 కోట్లకు పెంపు

ఇ-కామర్స్ వ్యాపారులకు జరిమానా తగ్గింపు

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పై అధ్యయనానికి కమిటీ

జీఎస్టీ నిభంధనల్లో సంచలన మార్పులు

జీఎస్టీ రేట్లలో ఊరట.. ఈసారి లేని మార్పులు

57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు!

న్యూఢిల్లీ, అక్టోబర్ : జీఎస్టీ కౌన్సిల్ గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించింది. ఈ కౌన్సిల్ ఒక కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, జీఎస్టీ కింద ఎటువంటి అరెస్టులు జరగవు. జీఎస్టీ కింద అరెస్టు చేసే అధికారాన్ని కౌన్సిల్ పూర్తిగా తొలగించింది. అలాగే, ప్రాసిక్యూషన్ పరిమితిని రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచింది. జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన అమలు, ప్రాసిక్యూషన్ నిబంధనలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను తొలగిస్తూ.. కౌన్సిల్ నిర్ణయించింది. దీంతో జీఎస్టీ ఉల్లంఘనలకు సంబంధించి పన్ను అధికారులు నేరుగా అరెస్ట్ చేసే అవకాశం ఇక ఉండదు. ఇప్పటివరకు తీవ్రమైన పన్ను ఎగవేత, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వంటి కొన్ని కేసుల్లో జీఎస్టీ అధికారులు అరెస్ట్ చేసే అధికారం ఉంది. ఈ అధికారాన్ని పరిమితం చేయడం ద్వారా సాధారణ పన్ను వివాదాలు, వ్యాపార సంబంధిత పొరపాట్లు క్రిమినల్ చర్యల స్థాయికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో సంస్కరణలు తీసుకొచ్చింది కేంద్రం. పన్ను బకాయిల వసూలు, వడ్డీ, జరిమానాల విధింపు వంటి ఇతర చర్యలు మాత్రం కొనసాగుతాయి. అదే సమయంలో జీఎస్టీ కింద ప్రాసిక్యూషన్ ప్రారంభించే పరిమితిని కూడా భారీగా పెంచారు. ఇప్పటివరకు రూ.1 కోటి పన్ను ఎగవేతకు సంబంధించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ ప్రారంభించే అవకాశం ఉండగా.. ఇకపై ఆ పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు. అంటే రూ.5 కోట్లకు లోబడిన పన్ను ఎగవేత కేసుల్లో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు వెళ్లే అవకాశం తగ్గనుంది. ఈ మార్పులను పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయడం, వ్యాపార సంస్థలపై అనవసరమైన చట్టపరమైన ఒత్తిడిని తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో కొత్త సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జీఎస్టీ 2.0లో భాగంగా కేవలం అరెస్ట్, ప్రాసిక్యూషన్ నిబంధనలే కాకుండా.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వ్యవస్థలో మార్పులు, రిఫండ్లను వేగవంతం చేయడం, వివాదాలను తగ్గించడం వంటి పలు అంశాలపై కూడా కౌన్సిల్ దృష్టి సారించింది. మొత్తంగా చూస్తే, జీఎస్టీ అమలులో కఠినమైన క్రిమినల్ చర్యల కంటే పన్ను వసూళ్లు, అనుసరణ, సులభమైన వ్యాపార విధానాలకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా తాజా నిర్ణయాలు ఉన్నాయని చెప్పొచ్చు. అయితే ఈ మార్పులు పూర్తిగా అమల్లోకి రావడానికి అవసరమైన చట్టపరమైన సవరణలు, తదుపరి ప్రక్రియ కూడా కీలకం కానున్నాయి.

గోదావరి-కావేరి లింక్‌పై కీలక ప్రతిపాదనలు!

సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసుకుని వికసిత్ భారత్ లక్ష్యం వైపు దేశాన్ని నడిపిస్తున్నారని చంద్రబాబు అభినందించారు.గోదావరి వరద జలాల్లో కొంత భాగాన్ని సమర్థంగా వినియోగించి దక్షిణాది రాష్ట్రాల నీటి అవసరాలను తీర్చేలా నదుల అనుసంధానంపై సాంకేతిక అధ్యయనం చేపట్టాలని చంద్రబాబు ప్రతిపాదించారు. గోదావరి--కావేరి అనుసంధానం పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ప్రస్తుతం గోదావరి నుంచి సముద్రంలోకి భారీగా నీరు వెళ్లిపోతున్న నేపథ్యంలో ఈ నీటిని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించే మార్గాలను పరిశీలించాలని కోరారు.పోలవరం ప్రాజెక్టు పురోగతి, నిర్మాణం, పునరావాస పనులపైనా చంద్రబాబు వివరాలు అందించారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, దీనికి కేంద్రం ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని ప్రధానిని కోరారు. 2027 గోదావరి పుష్కరాలు జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్నాయి. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఘాట్లు, రహదారులు, పారిశుద్ధ్యం, భద్రత తదితర మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం లోటు ఏర్పడి వ్యవసాయ రంగంపై ప్రభావం పడిందని చంద్రబాబు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. 2026 ఖరీఫ్ సీజన్‌లో 21 జిల్లాల్లోని 388 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు మధ్య సాధారణ వర్షపాతంతో పోలిస్తే 53.4 శాతం లోటు నమోదైనట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కరువు నివారణ, రైతులకు ఉపశమన చర్యల కోసం ప్రత్యేక కేంద్ర సాయం అందించాలని సీఎం కోరారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్, విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ వంటి కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, ఆర్థిక సహకారం అందించాలని చంద్రబాబు కోరారు. విశాఖ మెట్రో, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు ఆమోదం కోసం ప్రధాని వద్ద ప్రతిపాదనలు ఉంచనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అదే సమయంలో రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్, వ్యవసాయ రంగంలో కొత్త సంస్థల ఏర్పాటు, బాహ్య సహాయంతో అమలవుతున్న ప్రాజెక్టులకు కేంద్ర వాటా వంటి అంశాలపైనా సీఎం చర్చించారు.రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లిన ఈ భేటీలో.. ముఖ్యంగా నీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారంగా గోదావరి--కావేరి అనుసంధానానికి కేంద్రం నుంచి వచ్చే స్పందనపై ఆసక్తి నెలకొంది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్‌లో పోర్టు ఆధారిత పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని సుమారు 20,378 ఎకరాల ఉప్పు భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురోభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం పరిధిలో ఉన్న ఉప్పు భూములను రాష్ట్రానికి కేటాయించడం ద్వారా పోర్టుల విస్తరణ, అనుబంధ మౌలిక సదుపాయాల కల్పన సులభతరం అవుతుందని ముఖ్యమంత్రి వివరించారు. పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం ఈ భూములను వినియోగించుకోవడానికి వీలుగా బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. పోర్టులకు అవసరమైన కనెక్టివిటీ రోడ్లు, రైల్వే లైన్లు, ఇతర పారిశ్రామిక కార్యకలాపాలకు ఈ భూములు అత్యంత కీలకమని, దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపామని ఆయన గుర్తుచేశారు. ఇదే సమావేశంలో రాష్ట్ర రైతుల ప్రయోజనాలపైనా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతులు పండిస్తున్న మిర్చి, పొగాకు, ఆక్వా వంటి వాణిజ్య ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో విశేషమైన ఆదరణ ఉందని, వాటి ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర వాణిజ్య శాఖ తగిన సహకారం అందించాలని కోరారు. ఈ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలను కల్పించడంతో పాటు, నాణ్యతా ప్రమాణాల పెంపుదల, ప్రాసెసింగ్ సదుపాయాలు బలోపేతానికి కేంద్రం చేయూతనివ్వాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థనలపై కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు, నిధులు, అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ఆయన విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా, రాజధాని అమరావతి అభివృద్ధికి గుండెకాయ వంటి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు 189 కిలోమీటర్ల పొడవుతో ప్రతిపాదించిన ఈ ఓఆర్ఆర్, రాజధాని ప్రాంత అభివృద్ధిలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. అమరావతి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో భవిష్యత్తులో పెరిగే రవాణా అవసరాలను తీర్చడంలో ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని ఆయన కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడే మరికొన్ని కీలక ప్రాజెక్టులను కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్ర జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టు వద్ద ఎడమ, కుడి గట్లను అనుసంధానిస్తూ ఒక 'ఐకానిక్' వంతెన నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ప్రాజెక్టుకు అనుబంధంగా అవసరమైన రహదారులు, ఇతర వంతెనల నిర్మాణానికి సైతం కేంద్రం తోడ్పాటునందించాలని విన్నవించారు. రాష్ట్ర తీరప్రాంత అభివృద్ధికి, పర్యాటక, పారిశ్రామిక కనెక్టివిటీని పెంచేందుకు బీచ్ రోడ్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని చంద్రబాబు కోరారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా తీరప్రాంత నగరాలు, ఓడరేవులు, పర్యాటక కేంద్రాల మధ్య అనుసంధానం మరింత మెరుగుపడుతుందని ఆయన వివరించారు.

కొత్త ఓటు కోసం భారీగా దరఖాస్తులు

ఓటరు పేరును తొలగించాలన్న అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనను దాఖలు చేయవచ్చు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు అక్టోబర్ 7వ తేదీతో ముగిసింది. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించి నవంబర్ 5వ తేదీ వరకు పరిష్కరించనున్నారు. ఆ తర్వాత నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన ఈ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ముందుగానే ప్రకటించింది. జిల్లాల వారీగా చూస్తే కొత్త ఓటు నమోదు కోసం అత్యధిక దరఖాస్తులు హైదరాబాద్ జిల్లా నుంచి వచ్చినట్లు ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 1,93,135 ఫామ్-6 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 29,226 దరఖాస్తులు ఇప్పటికే ఆమోదం పొందినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ జిల్లా నుంచి 4,127 మంది ఎన్ఆర్ఐలు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 ఫామ్-8 దరఖాస్తులు అందాయి. ఓటర్ల తొలగింపు అంశంలో హైదరాబాద్ జిల్లా కూడా చర్చనీయాంశంగా మారింది. ఫామ్-7ల దాఖలాపై హైదరాబాద్ నగరంలో రాజకీయ వివాదం నెలకొన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఇటీవల బల్క్‌గా సమర్పించిన ప్రీ-ఫిల్డ్ ఫామ్-7ల వ్యవహారం కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ఎన్నికల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా మారే అవకాశం ఉందని తాజా రిపోర్టులు సూచిస్తున్నాయి. ఇప్పటికే కోట్లాది మంది ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితాలో చేర్చేందుకు అధికారులు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. నవంబర్ 9వ తేదీన వెలువడే తుది జాబితాతో రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ వివరాల్లో మార్పులు కోరినవారు తుది జాబితా ప్రచురణ తర్వాత.. తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవడం కీలకమని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల హైదరాబాద్ జిల్లాలో ఓటు తొలగింపు కోసం అందించే? ఫారం-7ల బోగస్? పత్రాల కట్టలు లభ్యమవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. అయితే ఇవాళ రాష్ట్ర ఎన్నికల కార్యాలయం (ఎస్?ఈవో) రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫారం-7లపై స్పష్టతనిచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 నియోజకవర్గాల నుంచి 6,335 ఫారం-?7లు వచ్చినట్లు ఎస్?ఈవో ప్రకటించింది. ముషీరాబాద్ నియోజకవర్గంలో 151 ఫారం-7లుగా రాగా, అందులో 87 తొలగించినట్లు తెలిపింది. గోషామహల్‌లో 222 ఫారం-7లకు గానూ 87 తొలగించినట్లు ఎన్నికల కార్యాలయం స్పష్టం చేసింది. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 6,335 ఫారం-7లు అందగా, ఇప్పటి వరకు 2,066 తొలగించారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన ఫారం-6లు అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచే వచ్చినట్లు ఎస్?ఈవో వెల్లడించింది. ఈ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కొత్త ఓటు కోసం మొత్తంగా 1,93,135 దరఖాస్తులు రాగా, అందులో ఇప్పటి వరకు 29,226 అప్లికేషన్లను ఆమోదించింది. ఈ ప్రాంతం నుంచి 4,127 ఎన్ఆర్ఐలు కూడా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఎస్?ఈవో వెల్లడించింది. దీంతో పాటు? జిల్లా పరిధిలో అడ్రస్, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపింది.

ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి..

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు క్షిపణి దాడులతో విరుచుకుపడింది. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్ పట్టణంలో రద్దీగా ఉన్న ఒక బస్టాప్‌పై జరిగిన రాకెట్ దాడిలో 33 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడగా, ఈ ఘోర దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ దాడి ధాటికి బస్టాప్ పరిసరాలన్నీ రక్తసిక్తమయ్యాయి. మృతదేహాలు, శిథిలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించాయి.

బీసీలే మా వెన్నెముక

కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇటీవల రద్దు చేసిన విషయం తెలిసిందే. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉటంకిస్తూ ఈ తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో లోకేశ్ మాట్లాడుతూ... "తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక. వారి ప్రయోజనాలను కాపాడటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు" అని అన్నారు. రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకముందే నెల్లూరు మేయర్ అభ్యర్థిని వైసీపీ ప్రకటించడం వారి అవగాహనారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. సుప్రీంకోర్టు నుంచి శుక్రవారం (రేపు) కీలక నిర్ణయం వెలువడవచ్చని ఆశిస్తున్నామని, తీర్పు రాగానే అక్టోబర్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికలు ముగిసిన తర్వాతే కార్పొరేషన్ చైర్మన్ల వంటి నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలకు రిజర్వేషన్ల రొటేషన్ తప్పనిసరిగా చేయాల్సి ఉందని కూడా ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో మండుతున్న ఎండలు

రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని వాతావరణ అధికారులు చెప్పారు. రుతుపవనాల తిరోగమనం ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆన్ కార్సన్‌కు 2026 సాహిత్య నోబెల్..!

కెనడా రచయిత్రిని వరించిన నోబెల్

సాహిత్య హద్దులను చెరిపేసిన రచయిత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 : కెనడాకు చెందిన ప్రముఖ కవయిత్రి, వ్యాసకర్త, అనువాదకురాలు, పండితురాలు ఆన్ కార్సన్‌కు 2026 సాహిత్య నోబెల్ బహుమతి దక్కింది. కవిత్వం, వ్యాసం, అనువాదం, ప్రాచీన సాహిత్యం, కల్పనా రచనల మధ్య ఉన్న సరిహద్దులను చెరిపేస్తూ ప్రత్యేకమైన శైలిని అభివృద్ధి చేసినందుకు ఆమెకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. 1950లో టొరంటోలో జన్మించిన కార్సన్.. చిన్నప్పటి నుంచే ప్రాచీన గ్రీకు సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్నారు. టొరంటో విశ్వవిద్యాలయంలో క్లాసిక్స్ చదివి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రాచీన గ్రీకు సాహిత్యం, పురాణాలు ఆమె రచనల్లో కీలక పాత్ర పోషించాయి. కవయిత్రిగానే కాకుండా అనువాదకురాలిగా, వ్యాసకర్తగా, అధ్యాపకురాలిగా కూడా ఆమె విశేష గుర్తింపు పొందారు. కార్సన్ రచనా ప్రత్యేకతకు 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్' మంచి ఉదాహరణ. 1998లో వెలువడిన ఈ పద్య నవల ప్రాచీన గ్రీకు పురాణంలోని గెరియాన్ కథ ఆధారంగా రూపొందింది. హెరాకిల్స్ చేతిలో హతమైన రెక్కల రాక్షసుడి కథను కార్సన్ ఒక సున్నితమైన యువకుడి ప్రేమ, ఎదుగుదల, వ్యక్తిత్వ అన్వేషణ కథగా మలిచారు. అలాగే ఎలెక్ట్రా, సాఫో వంటి ప్రాచీన గ్రీకు రచనలను అనువదించడం ద్వారా తన శాస్త్రీయ పాండిత్యాన్ని సృజనాత్మక రచనతో మేళవించారు. 2026 నోబెల్ రేసులో కార్సన్ పేరు ముందంజలోనే ఉంది. సాహిత్య ప్రక్రియల మధ్య గీతలను ప్రశ్నిస్తూ దశాబ్దాలుగా సాగించిన ప్రయోగాత్మక రచనకు ఈ పురస్కారం అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది. ఇప్పటివరకు అన్నే కార్సన్ రచనలు, అనువాదాలకు సంబంధించి 20కిపైగా పుస్తకాలు ప్రచురితమయ్యాయి. గ్రిఫిన్ పోయెట్రీ ప్రైజ్, లానన్ లిటరరీ అవార్డు వంటి పలు ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారాలను ఆమె అందుకున్నారు. ఇప్పుడు నోబెల్ సాహిత్య పురస్కారం కూడా ఆమె ఖాతాలో చేరింది. 2025లో హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నహోర్కైకి నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. ఆయన రచనల్లో కనిపించిన వినూత్నతకు ఈ గౌరవం దక్కింది. తాజాగా 2026లో అన్నే కార్సన్ ఈ అవార్డును అందుకున్నారు. 1901 నుంచి 2025 వరకు నోబెల్ సాహిత్య పురస్కారం 118 సార్లు ప్రకటించగా, మొత్తం 122 మంది ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఇప్పటివరకు 18 మంది మహిళలు నోబెల్ సాహిత్య పురస్కారం పొందారు. 1909లో స్వీడన్‌కు చెందిన సెల్మా లాగర్‌లెఫ్ ఈ అవార్డు అందుకున్న తొలి మహిళగా నిలిచారు. ఈ ఏడాది నోబెల్ పురస్కారం కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనాలు, భారత కరెన్సీలో రూ.11 కోట్లకు పైగా నగదు బహుమతి అందనుంది. ఒక విభాగంలో ఒకరి కంటే ఎక్కువ మంది విజేతలు ఉంటే ఈ మొత్తాన్ని సమానంగా పంచుతారు. ఇక నోబెల్ పురస్కారాల ప్రకటనల్లో భాగంగా శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించనున్నారు. అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ స్మారక పురస్కారాన్ని ప్రకటించనున్నారు.

చామనపల్లి గ్రామ పునరావాసానికి భూసేకరణ ప్రక్రియ చేపడతాం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

భారీ వర్షాలు, వరదల సమయంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు

ప్రజల అభిప్రాయాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం

మేడారం రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్‌కు 100 మీటర్ల పరిధి వరకు తరలింపు ప్రక్రియను చేపట్టే అవకాశం

పెద్దపల్లి, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : చామనపల్లి గ్రామ పునరావాసానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.ధర్మారం మండలం చామనపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం భూసేకరణ, పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు మరియు శ్రీ శ్రీనివాస రావు గుప్త చీఫ్ ఇంజనీర్ (ఇరిగేషన్) రామగుండం ల తో కలిసి జిల్లా కలెక్టర్ గ్రామస్థులతో సమావేశం నిర్వహించి, గ్రామ పునరావాసం, భూసేకరణకు సంబంధించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో విస్తృతంగా కాలినడకన పర్యటించి పలు ఇళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల సమయంలో గ్రామం ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అనేక మంది గ్రామస్థులు తమకు వినతులు సమర్పించారని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని చామనపల్లి గ్రామంలో భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.మేడారం రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్‌కు సంబంధించి 100 మీటర్ల పరిధి వరకు అవసరమైన తరలింపు ప్రక్రియను తక్షణమే చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. అయితే మొత్తం గ్రామాన్ని పునరావాసం చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు.గ్రామస్థుల అభిప్రాయాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.భూసేకరణ, పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ద్వారా అందిన ప్రజల వినతుల మేరకు చామనపల్లి గ్రామంలో భూసేకరణ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, గ్రామస్థుల నుంచి అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు ప్రభుత్వం తనను పంపినట్లు చెప్పారు.గ్రామంలో సుమారు 140 ఇళ్లు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందని కమిషనర్ తెలిపారు. గ్రామంలోని పాఠశాల, మహిళా సమాఖ్య భవనం వంటి నిర్మాణాలను ఇప్పటికే ఎత్తైన ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం అవి ముంపునకు గురికావడం లేదని పేర్కొన్నారు.పునరావాస కాలనీని అభివృద్ధి చేసి అర్హులైన వారికి ఇంటి స్థలాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి వ్యక్తికి నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు చేపడతామని చెప్పారు.ముంపు కారణంగా జీవనోపాధిని కోల్పోయే వారికి కూడా నిబంధనల మేరకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థుల అభిప్రాయాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య, ఇరిగేషన్ అధికారులు,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ మిర్యాలగూడలో కాంగ్రెస్ నిరసన ర్యాలీ.

మిర్యాలగూడ. (ది క్రైమ్ న్యూస్): ఢిల్లీలో నిర్వహించిన "సేవ్ డెమోక్రసీ--ఓట్ బచావో దేశ్ బచావో" కార్యక్రమంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (దీూ=) పాల్గొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు హక్కు అత్యంత కీలకమని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, ప్రజల ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని దీూ= స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, దీూ= బ్రదర్స్ సభ్యులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిసిపిని కలిసిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు.

మహేశ్వరం అక్టోబరు 08, (ది క్రైమ్ న్యూస్) : సైబరాబాద్ కమిషనరేట్ శేర్ లింగంపల్లి డిసిపి చింతమనేని శ్రీనివాస్ ను వారి కార్యాలయంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నర్సింహ్మా మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. అనంతరం డిసిపి శ్రీనివాస్ ను శాలువాతో ఘణంగ సన్మానం చేసి మొక్కను బహుకరించిన అభినందించారు.

గాయత్రి విద్యానికేతన్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు...

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రి ప్రైమరీ విద్యార్థులకు ముందస్తుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అందంగా ముస్తాబై, రంగురంగుల బతుకమ్మలను తీసుకువచ్చి ఆటపాటలతో సందడి చేశారు. దీంతో గాయత్రి విద్యానికేతన్ ప్రాంగణం బతుకమ్మ పూల సోయగాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను, దాని వెనుక ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి పరమైన ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతి పూజలోనూ పూలను ఉపయోగిస్తాం, కానీ పూలనే పూజించే ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ అని తెలియజేశారు. ప్రకృతికి, మన సంస్కృతి సంప్రదాయాలకు ఉన్న అనుబంధాన్ని, ప్రకృతిని గౌరవించడం ద్వారా కలిగే ప్రయోజనాలను చిన్నారులకు వివరించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గౌరీదేవిని పూజిస్తూ ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకోవడం మన సంప్రదాయమని తెలిపారు. బతుకమ్మ ఆటపాటల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థుల బతుకమ్మ ఆట, పాటలు, సంప్రదాయ దుస్తులు, రంగురంగుల బతుకమ్మలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించేలా ఎంతో ఆహ్లాదకరంగా సాగింది.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ, ప్రైమరీ టీచర్స్ బృందం పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు.

దేశద్రోహి ముద్రతో ఎన్నికల కమిషనర్‌గా కొనసాగే అర్హత లేదు - బీపీ నాయక్

ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి - బీపీ నాయక్ డిమాండ్

మధిర ప్రతినిధి ది క్రైమ్ న్యూస్ అక్టోబర్ 8 : జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి పార్టీలు నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిశ్రమల శాఖ బాధ్యులు, ఏఐసీసీ నాయకులు మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీపీ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై, విద్యార్థులపై, యువకులపై నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని, తన చర్యలకు మూల్యం చెల్లించుకునే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని హతమార్చాలని చూస్తే ప్రజా తిరుగుబాటు తప్పదని, నిరంకుశంగా వ్యవహరిస్తున్న అధికారులు సప్త సముద్రాలు దాటినా ప్రజలు వదలరని, చేసిన తప్పులకు శిక్ష అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి ముద్ర వేసుకున్న వ్యక్తి కాబట్టి ఆ ఉన్నత స్థానంలో కొనసాగే అర్హత లేదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నింపాలి గానీ అనుమానాలు కలిగించరాదని తేల్చి చెప్పారు. బీజేపీ పతనం మొదలైందని బీపీ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల - మధిరలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మధిర ప్రతినిధి ది క్రైమ్ న్యూస్ అక్టోబర్ 8 : మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నాడు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయబద్ధంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీక అని అన్నారు. తెలంగాణ సంప్రదాయాలను, సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థులు కాపాడుతూ భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి. అరుణ, ఉమెన్ ఎంపవర్మెంట్ కమిటీ సభ్యులు డా. ఎస్. ఇందిర, డా. పి. సుజాత, అధ్యాపకులు పి. లక్ష్మీనారాయణ, డా. వి. నాగరాజు, డా. ఎం.వి.ఎస్. శర్మ, పి. శ్రీనివాస్, షేక్ ఇమ్రాన్, ఎస్. జ్యోతి, టీ. ఆదర్శ్, ఎస్. పృథ్వీరాజ్, పి. నాగేశ్వరరావు తదితరులు, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జనగణనలో ఓబీసీ కులగణన కాలమ్ చేర్చకుంటే బీజేపీని ఓబీసీ ద్రోహుల పార్టీగా ప్రకటిస్తాం.

న్యూఢిల్లీ. (ది క్రైమ్ న్యూస్) : కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న జనగణనలో ఓబీసీ కులగణనకు ప్రత్యేక కాలమ్ చేర్చాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ డిప్యూటీ స్పీకర్ హాల్‌లో జరిగిన జాతీయ ఓబీసీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఓబీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. దేశానికి ఓబీసీ ప్రధానమంత్రి ఉన్నప్పటికీ ఓబీసీలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీల జనాభాను లెక్కిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఓబీసీల జనాభాను లెక్కించడానికి ఉన్న ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న ఓబీసీలకు జనగణనలో ప్రత్యేక స్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఓబీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను తెలుసుకోవడానికి కులగణన ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో ఓబీసీ కులగణన కాలమ్ చేర్చకపోతే బీజేపీని ఓబీసీ ద్రోహుల పార్టీగా ప్రకటిస్తామని జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు.

కోటి ఆదినారాయణకి నివాళులర్పించిన ఏపీ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

తెలంగాణ రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి

మధిర ప్రతినిధి ది క్రైమ్ న్యూస్ అక్టోబర్ 8: మధిర పట్టణం లో టీచర్స్ కాలనీ వాస్తవ్యులు కోటి ఆదినారాయణ గారు ఇటీవల వృద్ధాప్యంతో మృతిచెందగా, గురువారం వారి స్వగృహంలో జరిగిన దశదినకర్మకు ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్యకర్తలే పార్టీకి బలమని, వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు కోటి ఆదినారాయణ కుమారుడు కోటి మధు మైలవరంలోని తన షోరూం ముందు ఆ అక్రమ అరెస్టుకు నిరసన తెలిపేందుకు పార్టీకి అండగా బలంగా నిలిచారని గుర్తు చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా పార్టీ కోసం అండగా నిలబడిన వారిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మధిర టీడీపీ ముఖ్య నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సన్నాహక సమావేశం

నాచారం సర్కిల్ కార్యాలయంలో సమీక్ష

మేడ్చల్, అక్టోబర్ 08(ది క్రైమ్ న్యూస్): రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాచారం సర్కిల్ కార్యాలయంలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. కాప్రా మున్సిపల్ కార్యాలయ పరిధిలో నిర్వహించిన ఈ సమావేశానికి డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ ఆధ్వర్యం వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమావేశానికి హాజరై ఎన్నికల సన్నాహకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయిలో సమన్వయం, పట్టభద్ర ఓటర్లను కలిసే అంశాలపై చర్చించారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించడంతోపాటు ఎన్నికల ప్రక్రియపై వారికి వివరించాలని సూచించారు. అలాగే క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బండారి లక్ష్మారెడ్డి సూచించారు. పట్టభద్ర ఓటర్లను కలిసి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవడంతోపాటు ఎన్నికలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో నాచారం డివిజన్‌కు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికల సన్నాహకాలపై తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.

నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్త దానం చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు.

ధర్మపురి, అక్టోబర్ 8, (ది క్రైమ్ న్యూస్): బిజెపి రాష్ట్ర శాఖ పిలుపుమేరకు బిజెపి రాష్ట్ర నాయకులు దామెర రామ సుధాకర్ రావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గురువారం నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా పాలన జీవితం పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఇందులో భాగంగా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బిజెపి రాష్ట్ర నాయకులు దామెర రామ్ సుధాకర్ రావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దామెర రామ్ సుధాకర్ రావు మాట్లాడుతూ నేడు కార్యకర్తలు చేసిన రక్తదానం వల్ల అనారోగ్యంతో ఉన్న రోగులకు కొంత ఊరటనిచ్చి వారి కుటుంబాలలో వెలుగు నింపుతున్నారని అన్నారు. సెప్టెంబర్ 17వ తేదీన నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని ధర్మపురి నియోజకవర్గంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. నరేంద్ర మోడీ పాలనలో దేశం ముందుకు దూసుకుపోతుందని ఆత్మ నిర్భర్ పేరుతో వికసిత భారత్ లక్ష్యంగా మేడ్ ఇండియా మేక్ ఇండియా స్కిల్ ఇండియా లాంటి పథకాల ద్వారా యువతలో మేధావులలో ఉన్న సృజనాత్మక శక్తిని శక్తిని వెలికి తీసి స్వదేశీ పరిజ్ఞానాన్ని పెంపొందింపజేసి భారత దేశ కీర్తి ప్రతిష్టలను పెంచి ప్రపంచంలోని అభివృద్ధి చెందిన అగ్రరాజ్యాల సరసన నిలబెట్టే ప్రయత్నంలో 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను నాలుగవ స్థానంలో నిలిపాడని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. నరేంద్ర దౌత్య విధానం వల్ల ప్రపంచంలోని ఏదేశ పర్యటనకు వెళ్లిన నరేంద్రమోడీని పెద్దన్నలా చూస్తూ పాదాభి వందనం చేస్తున్నారని పేర్కొన్నారు.

సంపాదకీయం

నోబెల్‌పై ట్రంప్ ఆశలు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నోబెల్ బహుమతి ఈ సారి ఎవరిని వరించనుంది? ఈ శాంతి బహుమతి కోసం పలువురి మధ్య కీలక పోటీ నెలకొంది. ముఖ్యంగా ప్రపంచ శాంతి, మానవతా సంక్షోభాలపై నిరంతరం దౌత్యపరమైన పిలుపునిస్తున్న పోప్ లియోతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్‌స్కీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, నార్డిక్ ప్రజాప్రతినిధులు లీసా మొర్కొవ్‌స్కీ, అజా చెమినిట్జ్‌లు నామినేట్ అయినవారిలో ఉన్నారు. రష్యా దండయాత్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని, శాంతిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలకు గానూ ఉక్రెయిన్ అధ్యక్షుడు పేరు గత కొన్నాళ్లుగా నామినేట్ అవుతోంది. అయితే ఈ ఏడాది నోబెల్ బహుమతుల ప్రకటన కొనసాగుతోంది. ఇప్పటికే మెడిసిన్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో పాటు సాహిత్యంలో విజేతలను ప్రకటించారు. అయితే, శాంతి బహుమతిపై యావత్తు ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. శుక్రవారం (అక్టోబరు 8న) విజేతను ప్రకటించనున్నారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం 208 మంది, 79 సంస్థలు సహా 287 నామినేషన్లు నమోదయ్యాయి. నోబెల్ కమిటీ నియమాల ప్రకారం అధికారిక నామినేషన్ల జాబితా 50 ఏళ్ల వరకు అత్యంత గోప్యంగా ఉంచుతారు. అయితే, నామినేట్ చేసిన వ్యక్తులు లేదా సంస్థల బహిరంగ ప్రకటనలు, అంతర్జాతీయ మీడియా కథనాలు, నిపుణుల విశ్లేషణల ఆధారంగా ఈ రేసులో ప్రముఖంగా పలు పేర్లు వినిపిస్తున్నాయి. వీటిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు కూడా ఉన్నట్టు వెల్లడయ్యింది.నోబెల్ బహుమతి కోసం కొన్నేళ్లుగా విశ్వప్రయత్నాలు చేస్తున్న ట్రంప్.. బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ తన మొదటి పదవీకాలం నుంచే నోబెల్ కల కంటున్నారు. అనేక యుద్ధాలను ఆపిన తానే అసలైన శాంతిదూతను అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య అబ్రహమ్ అకార్డ్‌తో చారిత్రక దౌత్య సంబంధాలు కుదిర్చినందుకు శాంతి బహుమతి పలుమార్లు నామినేట్ చేశారు. నార్వే పార్లమెంట్ సభ్యులు, అమెరికా కాంగ్రెస్‌లోని రిపబ్లికన్ ప్రతినిధులు, పాకిస్థాన్ వంటి దేశాలకు చెందిన నాయకులు అనేక సందర్భాల్లో ట్రంప్ పేరును అధికారికంగా ప్రతిపాదించారు. ఈ ఏడాది కూడా శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో 'అయినా నాకు ఇవ్వరు లే' అంటూ నోబెల్ కమిటీపై బాహటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్నో యుద్ధాలను ఆపానని, ఈ పురస్కారం నాకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ట్రంప్.. నా కృషికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదు' అంటూ రసరసలాడుతున్నారు. ఇటీవల నోబెల్ బహుమతుల ప్రకటనకు ముందు కూడా " నేను ఎనిమిది యుద్ధాలను ఆపాను.. నోబెల్ కమిటీ నాకు ఇవ్వకపోతే వారికే అవమానం" అని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడైన కొద్ది నెలలకే బరాక్ ఒబామాకు నోబెల్ రావడంపై కూడా పలుసార్లు తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌కు చెందిన ప్యాడ్‌మాన్‌గా గుర్తింపు పొందిన అరుణాచలం మురుగనాథన్ కూడా నామినేట్ అయ్యారు. మహిళల రుతుక్రమ పరిశుభ్రతపై అద్భుతమైన సామాజిక విప్లవాన్ని తెచ్చినందుకు, ఆయన చేసిన కృషికి గానూ బహిరంగంగా నామినేట్ అయినట్టు నివేదికలు పేర్కొన్నాయి. ప్రపంచ వివాదాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, యుద్ధ నేరాలపై చట్టపరమైన జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి కృషిచేసిన అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేరాల కోర్టు , భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అనేక దేశాలు శాంతియుతంగా అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నందుకు ప్రతీకగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం పేరు కూడా నామినేట్ అయ్యింది. మరోవైపు నోబెల్ శాంతి బహుమతికి తానే పూర్తిగా అర్హుడినని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. ఇప్పటివరకు ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని విధంగా ప్రపంచ శాంతి కోసం తాను విశేష కృషి చేశానని, ఏకంగా ఎనిమిది యుద్ధాలను ఆపానని ఆయన పాతపాటే పాడారు. నార్వేజియన్ పీస్ కమిటీ శుక్రవారం ఈ అవార్డులను ప్రకటించనున్న నేపథ్యంలో శ్వేతసౌధంలో మీడియాతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు నోబెల్ పురస్కారం ఇవ్వకపోతే, అది ఆ కమిటీకే పెద్ద అవమానమని ఆయన అన్నారు. 2009లో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆయనకే తెలియదంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, మారియా కొరినా మచాడో ఆ అవార్డుకు తనకంటే ట్రంపే ఎక్కువ అర్హుడని చెబుతూ ఆమె బహుమతిని తనకు అందించారని గుర్తుచేశారు. వివిధ దేశాలపై వాణిజ్య సుంకాలను అస్త్రంగా ఉపయోగించి, అనేక యుద్ధాలు జరగకుండా అడ్డుకోగలిగానని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలను కూడా త్వరలోనే పరిష్కరిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తానెన్నో యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తన కంటే అర్హులెవరూ లేరంటూ గతంలో కూడా చాలాసార్లు ట్రంప్? పేర్కొన్నారు. నోబెల్ కమిటీని ఉద్దేశిస్తూ, వారి నిర్ణయం ఏంటో తమకు తెలియదని, తనలాంటి వారికి ఈ పురస్కారం ఇవ్వకపోవడమే వారికి అలవాటుగా కనిపిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇంతకుముందు ఎవరూ చేయలేని పనులు నేను చేశా. నేను గొప్పలు చెప్పుకోవడం లేదు. కేవలం వాస్తవాలు మాత్రమే చెబుతున్నా. బహుశా ఏ అధ్యక్షుడు కూడా ఇన్ని యుద్ధాలను పరిష్కరించి ఉండకపోవచ్చు. కానీ నేను మాత్రం ఒకటి రెండు కాదు, ఏకంగా 8 యుద్ధాలు ఆపాను. కాబట్టి నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు నేను అర్హుడిని. కానీ అది నాకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువే. ఒకవేళ నాకు నోబెల్? ఇవ్వకపోతే అది కమిటీకి పెద్ద అవమానం అవుతుందని అన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది నామినేషన్లలో ట్రంప్ పేరు ఉండొచ్చని గతంలోనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం ఎవరిని వరిస్తుందన్న విషయంపై ఉత్కంఠ నెలకొంది. ఏది ఏమైనా అన్నివిధాల అర్హుడికే ఈ నోబెల్ శాంతి బహుమతి దక్కాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నీతి ఆయోగ్ చర్చల ప్రభావం ఎంత?

ఏటా మొక్కుబడిగా సమావేశాలు

సిఎంల అభ్యర్థనలపై చర్యలు శూన్యం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి మోడీ సమక్షంలో... ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ భేటీలో పలు అంశాలపై చర్చ జరగడం అటుంచితే..పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కాలేదు. తెలుగు రాష్ట్రాలకు చెందిన సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చక్కగా ఇచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సంక్షేమం అన్నది ఉమ్మడిగా నిర్ణయించి ముందుకు సాగాల్సి ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించడం లేదు. నీతి ఆయోగ్‌లోనూ ప్రధాని ప్రసంగానికే పెద్దపీట వేస్తున్నారు. హాజరైన సిఎంలు ప్రస్తావించిన అంశాలపై చర్చించడం లేదా, తదుపరి చర్యలు కానరావడం లేదు. మొత్తంగా దేశంలో కేంద్రంలో ఏ పార్టీ అధికారం లో ఉన్నా సమావేశాలు, చర్చలు అన్నవి తూతూ మంత్రంగా సాగుతున్నాయి. సమావేశాలు, చర్చలు అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా సాగుతున్నాయి. అనేక సందర్భాల్లో నీతి ఆయోగ్ సమావేశాల్లో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ సమస్యలపై నేరుగానే ప్రశ్నించారు. ఆయా రాష్ట్రాల సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లారు. అయినా లాభం లేకపోవడంతో ఇక సమావేశాలకు హాజరు కావడం దండగ అన్న భావనలో ఉన్నారు. నీతి ఆయోగ్ ప్రారంభించి సమయంలో కనిపించిన స్ఫూర్తి లోపించింది. నీతి ఆయోగ్ ఏర్పాటు దశలో ప్రధాని మోడీ ఆనాడు చేసిన ప్రకటనకు భిన్నంగా ఈ పదకొండేదేళ్లుగా నీతి తప్పిన ఆయోగ్‌గా అవతరించింది. సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా మొత్తం దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే ఆయా రాష్ట్రాలకు తగిన గౌరవం ఇచ్చి వారిని కూడా ఇందులో భాగస్వాములను చేయాల్సి ఉంది. రాష్ట్రాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన కేంద్రం ఆ దిశగా పనిచేయడం లేదు. మళ్లీ పాతపద్ధతిలోనే సాగుతోంది. నీతి ఆయోగ్ లక్ష్యాలను విస్మరించారు. ఇక్కడ జరిగే చర్చలకు పెద్దగా ప్రాధాన్యం ఉండడం లేదు. ఇదే విషయాన్ని పలువురు సిఎంలు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. అంతెందుకు ఒకే పన్ను విధానం అంటూ తీసుకుని వచ్చిన జిఎస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అది చూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. ప్రజలు అనేక సందర్భాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును సొంత అవసరాలకు తీసుకోవ డానికి కూడా ఇబ్బంది పడటాన్ని గ్రామాల్లో ఇప్పటికీ చూస్తున్నాం. నగదు ఉపసంహరణపై ఎన్నో ఆంక్షలు పెట్టారు. ఇలాంటి వాటి వల్ల ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇవన్నీ నీతి ఆయోగ్‌లో చర్చించడం లేదు. పార్లమెంటులో చర్చకు అవకాశం ఉండడం లేదు. మొత్తంగా పాలకులకు అధికారమే తప్ప ప్రజలు కనబడడం లేదు. ఎంపిలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించ డంలో శ్రద్ధ చూపడం లేదు.రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృథా ఖర్చులకు కళ్లెం పడాలి. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విసలాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఉమ్మడి ఎపి విడివడ్డ తరవాత జరిగిన ఆర్థిక విధ్వంసమే ఇందుకు కారణం. అభివృద్ధి పేరుతో చేసిన అప్పులకు నేతలను బాధ్యులుగా చేస్తే మంచిది. రాజ్యాంగం ఏ మేరకు ఎంతవరకు అమలు సాధించామన్నది పాలకులుగా రాజకీయ పార్టీల నేతలు మననం చేసుకోవాలి. అందరికీ సమ న్యాయం అందుతుందా అన్నది చూడాలి. నేలవిడిచి సాము చేసే విధంగా దేశీయంగా ఉత్పత్తులపై దృష్టి పెట్టి స్వయం సమృద్ధి సాధించకుండా దావోస్ లాంటి వేదికలపై పెట్టుబడులకు వెంపర్లాడుతున్న విధానం పోవాలి. దేశీయంగా ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని యువతను స్వయం సమృద్ధికి సన్నద్ధం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీసుకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలి. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అసమానాతలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదు. ఈ రంగాలకు కేటాయింపులు పెరగడం లేదు. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ కూడా ఇంకా దారిద్ర్యం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి.వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. నీతి ఆయోగ్‌ను బలోపేతం చేస్తూ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఉమ్మడిగా ముందుకు సాగాల్సి ఉంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: పవన్

అమరావతి : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్టుపెట్టారు. భవిష్యత్ తరాలకి అందించాల్సిన గొప్ప బహుమతి శుభ్రమైన పర్యావరణం.. చెట్లు నాటి పచ్చదనాన్ని పెంచుదాం.. నీటి కాలుష్యాన్ని నివారిద్దాం నీటి వనరులను కాపాడుకుందాం.. వన్యప్రాణులను రక్షించుకుందాం.. జీవవైవిధ్యాన్ని పరిరక్షిద్దాం.. పర్యావరణాన్ని ప్రేమిద్దాం.. భవిష్యత్ తరాల భద్రతకై కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు.. ఇక, సుసంపన్నమైన ప్రకృతిని మన పిల్లలకు బహుమతిగా ఇద్దాం.. ఇది మన భూమి.. ఇది మన బాధ్యత అని తన ట్వీట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు..

ఆదర్శంగా తెలంగాణ అభివృద్ధి

రైతులకు అండగా రేవంత్ సర్కార్

కామారెడ్డి : ముఖ్యమంత్రి రేంవత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వం సలహాదారు, మాజీమంత్రి షబ్బీర్ అలీ అన్నారు. తెలంగాన అభివృద్ధి ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు దేశానికి ఆదర్శమని, ఇతర రాష్ట్రాల వారు తెలంగాణను ఆధ్యయనం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో అందిస్తున్న పథకాలు, ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఎందుకు లేవో సమాధానం చెప్పాలన్నారు. గాలి మాటలు చెప్పే వారికి గట్టి సమాధానం ఇవ్వాలని అన్నారు. ప్రజలు ఆలోచించి.. మంచి పనిచేసే వారికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో నీటి, కరెంట్ కొరత లేదని స్పష్టం చేశారు. రైతు లేనిదే రాజ్యం లేదని, రైతు పంట పండిస్తేనే కడుపునిండా తిని బతుకుతామని, అలాంటి రైతును కాపాడుకోవాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పమని షబ్బీర్ అలీ అన్నారు. సాగునీరు, ఉచిత కరెంటు, పంట పెట్టుబడి సాయం, ధాన్యం కొనుగోలు కేంద్రాలతో మద్దతు ధర అందిస్తున్నది తెలంగాణ ప్రభుత్వమని, రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక సీఎం రేవంత్ వివరించారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారని రైతులను బతికించాలనే ఉద్దేశంతో పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకున్నారని కొనియాడారు.

పర్యావరణహితంగా హైదరాబాద్

ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యం

హైదరాబాద్ : హైదరాబాద్ నగరం విశ్వనగరంగా మారాలన్న తపనతో సిఎంరేవంత్ అనేక చర్యలు తీసుకుంటున్నారని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మూసీ సుందరీకరణ ఇందులో భాగమేనని అన్నారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచడంతో పాటు, అందమైన నగరంగా తీర్చిదిద్దడం కూడా తమ లక్ష్యంగా ఉందని అన్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ, నగర పరిశుభ్రతకు ప్రజలుకూడా తోడ్పాటును ఇవ్వాలన్నారు. మననగరాన్ని మనమే మంచిచేసుకోవాలన్న లక్ష్యం రావాలన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏమీ చేయలేమని అన్నారు. ప్రజలు ఇది తమ నగరం అని గుర్తించి ముందుకు సాగాలన్నారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందడానికి జరగాల్సిన పని చాలా ఉంది. సాగునీరు, తాగునీరు, అటవీ సంపద, పట్టణాభివృద్ధి, పరిశ్రమల్లో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

మంచి ఆలోచనలే శ్రీరామరక్ష

తిరుమల : చెడు వ్యసనాలు వదిలి నిర్మల మనస్సుతో ఉన్నంత కాలం మనలను ఏ మలినం ఆవరించదు. ఓ రకంగా నిర్మలమైన మనస్సు ఆరోగ్యానికి హేతువు.మన మనస్సు చేసే మంచి ఆలోచనలతోనే మన దేహం కూడా అదుపులో ఉంటుంది. ఆరోగ్యంగా ఉంటుంది. చెడు ఆలోచనలను మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ఇకపోతే ఇది సత్యం. సత్యం కఠినంగానే ఉంటుంది. మనిషి సత్యవచస్సులోని ఆంతర్యాన్ని తెలుసుకొని ఆచరిస్తే, ఆ కఠినవచస్సు అమృతమయం అవుతుంది. అనేక వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. అలాంటివాడికి వ్యసనాలను మానుకొమ్మని చెప్పే మాటలు రుచించవు. నిప్పుల్లోకి దూకే మిడతకు ఆ నిప్పు కాల్చివేస్తుందనే సత్యం తెలియదు. అలాగే వ్యసనాలకు లోనైన మనిషికి వాటి పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసనపరులతోనే సహవాసం చేస్తారు. మంచివాళ్లు చెప్పే మాటలు వారి చెవులకు శూలాల్లా గుచ్చుకొంటాయి. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే- వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. మనిషి బాగుపడాలంటే పెద్దలపట్ల భయమైనా ఉండాలి, లేదా మంచి విషయాలపై భక్తి అయినా ఉండాలి. భయం కాని, భక్తి కాని లేని మనిషి తెగిన గాలిపటంలా ఎక్కడ పతనమవుతాడో ఎవరికీ తెలియదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందంగా, మనిషి అధోగతిపాలైన తరవాత జ్ఞానోదయమైనా- చేయగలిగిందేమీ ఉండదు. మనిషికి భాగ్యదాయక క్షణాలు ఎప్పుడో కానీ రావు. అలా వచ్చినవాటిని చక్కగా ఉపయోగించుకొనేవాడికి జీవితం ఆనంద బృందావనం అవుతుంది. ఎవరో రావాలని, ఏదో చేయాలని భ్రమలో మునిగిపోతూ కర్తవ్యాన్ని మరచే మనిషిని దేవుడు కూడా బాగుపరచలేడు.



ఆధ్యాత్మికం

జిల్లావయోవృద్ధుల అనుభవం, జ్ఞానం సమాజానికి ఎంతో విలువైనది

వయోవృద్ధుల ఆరోగ్యం సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై వయోవృద్ధులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు కలిగిన వయోవృద్ధులను ప్రత్యేకంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ శాలువాలు కప్పి వారిని ఘనంగా సన్మానించారు. సమాజ నిర్మాణంలో వయోవృద్ధులు అందించిన సేవలు, వారి అనుభవాలు, జ్ఞానాన్ని కొనియాడారు. వయోవృద్ధులకు గౌరవం, ఆప్యాయత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, వయోవృద్ధులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా నడక, యోగా, తగిన వ్యాయామాలు చేయాలని సూచించారు. వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహిస్తూ సమతుల్య ఆహారం తీసుకోవాలని, వైద్యుల సూచనలను పాటించాలని తెలిపారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వయోవృద్ధుల అనుభవం, జ్ఞానం సమాజానికి ఎంతో విలువైనదని, వారి సూచనలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రతతో పాటు వారు గౌరవప్రదమైన జీవితం గడిపేలా అవసరమైన సహకారం అందించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా వారికి అవసరమైన అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోదావరి, పున్న రాజేశ్వర్, రాజన్న, జిల్లా సంక్షేమ అధికారి వెంకటేష్, జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ప్రతినిధులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. వయోవృద్ధుల పట్ల సమాజంలో గౌరవం, ఆప్యాయత, బాధ్యత మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. వయోవృద్ధుల సేవలను గుర్తించి, వారిని సత్కరించి నిర్వహించిన ఈ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

సకాలంలో స్పందనతో రూ.80 లక్షల సైబర్ మోసం నివారణ

మేడ్చల్, అక్టోబర్ 08(ది క్రైమ్ న్యూస్): బ్యాంకు నుంచి అందిన అప్రమత్తత సమాచారంపై కుషాయిగూడ పోలీసులు సకాలంలో స్పందించి సుమారు రూ.80 లక్షల సైబర్ మోసాన్ని నివారించారు. డిజిటల్ అరెస్ట్, సెక్స్టార్షన్ మోసగాళ్ల వలలో చిక్కుకున్న ఓ సీనియర్ సిటిజన్‌ను కుషాయిగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు గుర్తించి కౌన్సెలింగ్ అందించారు. మోసగాళ్లు మరింత నగదు బదిలీ చేయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని బాధితుడికి మోసపూరిత వ్యవహారంపై అవగాహన కల్పించారు. దీంతో అదనంగా నగదు బదిలీ కాకుండా అడ్డుకుని, సుమారు రూ.80 లక్షల వరకు సంభవించగల ఆర్థిక నష్టాన్ని నివారించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులమని, దర్యాప్తు సంస్థల అధికారులమని పరిచయం చేసుకుంటూ వీడియో కాల్స్ చేయడం, కేసుల్లో ఇరికిస్తామని బెదిరించడం, వ్యక్తిగత సమాచారం లేదా నగదు డిమాండ్ చేయడం వంటి వాటిని ప్రజలు నమ్మవద్దని పోలీసులు సూచించారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు అపరిచితుల నుంచి వచ్చే వీడియో కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనా, అనుమానాస్పదంగా డబ్బు బదిలీ చేసినా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

మల్లాపూర్ లాడ్జిలో వ్యక్తి మృతి

మేడ్చల్, అక్టోబర్ 08(ది క్రైమ్ న్యూస్): మల్లాపూర్‌లోని శ్రీ తిరుమల లాడ్జిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. నాచారం పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడిని కోటేశ్వరరావు (52)గా గుర్తించారు. ఆయన మిర్జాలగూడలోని ఆయా అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. కోటేశ్వరరావు గత నాలుగు రోజులుగా శ్రీ తిరుమల లాడ్జిలో బస చేస్తున్నారు. అయితే రెండు రోజులుగా గది నుంచి బయటకు రాకపోవడంతో లాడ్జి మేనేజర్‌కు అనుమానం వచ్చింది. గది తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో కిటికీలోంచి పరిశీలించగా కోటేశ్వరరావు గదిలో కిందపడి కనిపించారు. దీంతో తలుపు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఆయన భార్య పెద్ది బోట్ల వసుంధర సంఘటనా స్థలానికి చేరుకుని భర్తను గుర్తించారు. బాత్రూమ్‌లో స్నానం చేసిన అనంతరం బయటకు వస్తున్న సమయంలో జారిపడి కిందపడటంతో తీవ్ర గాయం కావడం వల్లే మృతి చెంది ఉండవచ్చని ఆమె పోలీసులకు తెలిపినట్లు సమాచారం. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని, ఎవరిపైనా ఫిర్యాదు లేదని ఆమె పేర్కొన్నారు. సమాచారం అందుకున్న నాచారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి అసలు కారణం స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

మనవడి పుట్టిన రోజున వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ

సుల్తానాబాద్, అక్టోబర్ 08(ది క్రైమ్ న్యూస్) : ధన బలం ప్రదర్శించే హంగులు, ఆర్భాటాలకు పోకుండా, సమాజంలో తోటి పేదవారికి సహాయం చేయడమే పరమావధిగా భావించి సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు, ప్రముఖ రైస్ మిల్ వ్యాపారవేత్త కొమురవెల్లి రామ్మూర్తి - సత్తెమ్మ దంపతులు తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. వారి మనవడు శ్రీశాంక్ పుట్టినరోజు సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో గల ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు వారు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కేవలం బట్టలు ఇవ్వడమే కాకుండా, ఆశ్రమంలోని వృద్ధులకు సరిపోయేలా ముందుగానే ప్యాంట్, షర్టుల కొలతలు తీసుకుని కుట్టించి ఇవ్వడం రామ్మూర్తి కుటుంబ సభ్యుల నిరుపమానమైన సేవా నిరతికి, బాధ్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ ఆత్మీయ కార్యక్రమానికి ఆశ్రమ వృద్ధులు ఎంతగానో స్పందించి, బాబు శ్రీశాంక్‌కు పుట్టినరోజు దీవెనలు అందజేశారు. అనంతరం కొమురవెల్లి రామ్మూర్తి - సత్తెమ్మ దంపతులతో పాటు వారి కుమారుడు-కోడలు రాజేష్ - ప్రియాంక, కుమారులు శ్రీశాంక్, శ్రేయాంక్ లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొమురవెల్లి రామ్మూర్తి మాట్లాడుతూ, వృథా ఖర్చులతో వేడుకలు చేసుకోవడం కంటే ఇలా అవసరంలో ఉన్న వృద్ధులకు చిన్న సహాయం అందించడం మానసికంగా ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, ఆర్యవైశ్య సమాజం ఎప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్ - లక్ష్మి, వృద్ధాశ్రమం కో-ఆర్డినేటర్ గట్టు స్వామి, నరేష్ , ఆశ్రమ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జిల్లాక్షయ వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

2030 నాటికి టీబీ రహిత భారత్ సాధనే లక్ష్యంజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా క్షయ వ్యాధి నిర్మూలనకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. 2030 నాటికి దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకట్, ఎన్‌సీసీ కమాండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా జోష్ బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వార్డు, మండల స్థాయిలో ఆరోగ్య బృందాలను ఏర్పాటు చేసి ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు టీ బి అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలో ఇప్పటికే 7 టీబీ ముక్త గ్రామ పంచాయతీలను గుర్తించినట్లు తెలిపారు. క్షయ వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే అంటువ్యాధి అని, దగ్గు, తుమ్ముల ద్వారా ఇతరులకు సోకే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని తెలిపారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు, పొగతాగే అలవాటు ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేసి, అనుమానితులు పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 832 టీబీ కేసులు ఉన్నాయని, టీబీ రోగులకు ప్రతి నెలా వైద్య సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి మందులు అందించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నిక్షయ్ పోషణ యోజన ద్వారా టీబీ రోగులకు చికిత్స పూర్తయ్యే వరకు 6000 పోషణ భత్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా టీబీ రోగులను దత్తత తీసుకుని వారికి అవసరమైన పోషకాహారం అందించాలని కలెక్టర్ సూచించారు. వైద్యుల సూచన మేరకు మందులను నిర్దేశిత కాలం పాటు క్రమం తప్పకుండా వినియోగిస్తే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. టీబీ రోగులను దూరంగా ఉంచకుండా వారికి మానసిక ధైర్యం, అవసరమైన సహకారం అందించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సిబ్బంది ఒక్కొక్కరు ఒక టీబీ రోగిని దత్తత తీసుకుని వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. గ్రామస్థాయిలో సర్పంచులు, పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సమన్వయంతో పనిచేసి క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. టీబీ నిర్మూలనపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు మీడియా సహకారం తీసుకోవాలని సూచించారు. టీబీకి సంబంధించిన సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం టీబీ ముక్త భారత్ అభియాన్‌ను విజయవంతం చేసి, క్షయ వ్యాధి నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌సీసీ, మై భారత్ క్యాడెట్లు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకూ పండుగ ప్రయోజనాలు కల్పించాలి

తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్

లాభాల వాటా రూ.10 వేలకు పెంచి దసరా అడ్వాన్స్ రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : సింగరేణిలో పర్మినెంట్ కార్మికులకు ప్రకటించిన బోనస్ తరహాలో కాంట్రాక్టు కార్మికులకు కూడా పండుగ ప్రయోజనాలు అందించాలని తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ కోరారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు రూ.1,10,250 బోనస్ ప్రకటించడంపై కార్మికుల కుటుంబాల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో సంస్థలో ఒకే ప్రాంతంలో, ఒకే పనిని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా రూ.25 వేల దసరా అడ్వాన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కాంట్రాక్టు కార్మికులకు చెల్లించిన రూ.5,500 లాభాల వాటాను ఈసారి రూ.10 వేలుగా పెంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఉత్పత్తిలో కాంట్రాక్టు కార్మికుల పాత్ర కీలకమైనప్పటికీ తక్కువ వేతనాలతో వారు కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో వాటా, బోనస్, అడ్వాన్స్ వంటి ప్రయోజనాలు అందుతున్నప్పుడు కాంట్రాక్టు కార్మికుల ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల శ్రమకు గౌరవం ఇవ్వాలంటే వారి వేతనాలు పెంచడంతో పాటు పండుగల సందర్భంగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. 8 రాష్ట్రాల్లో హైపవర్ కమిటీ వేతనాలు అమలు అవుతున్నప్పుడు సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు వాటిని ఎందుకు అమలు చేయడం లేదో ప్రభుత్వం, యాజమాన్యం ఆలోచించాలని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీసం రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు పండుగ బోనస్ లేదా అడ్వాన్స్ అందిస్తే వారి కుటుంబాలు కూడా సంతోషంగా పండుగ జరుపుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి అధికారులు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేకపోతే కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మద్దెల శ్రీనివాస్, ఎరుకల నాగరాజు, కమాటం సందీప్, రామగిరి శ్రీనివాస్, బోయ రాజు పాల్గొన్నారు.

తల సేమియా వ్యాధి చిన్నారుల ప్రాణాలను కాపాడుదాం

ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల సేమియా వ్యాధి గురించిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది చిన్నారులు తల సేమియా వ్యాధితో బాధపడుతున్నారని ఆ చిన్నారుల ప్రాణాలను కాపాడాలంటే ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం వారి జీవితాంతం అవసరం ఉంటుందని వారికి కావలసిన రక్తాన్ని అందజేయడానికి రక్తదాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. రక్త కొరత వలన చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారి ప్రాణాలను కాపాడడం కోసం రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామన్నారు. 6 వేల యూనిట్లకు పైగా రక్తాన్ని ఇప్పటివరకు తల సేమియా వ్యాధి చిన్నారులకు అందజేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు వసంత్,గంగాధర్, శ్రీనివాస్,వినోద్, గంగారం,అనిల్,సరిత లు పాల్గొనడం జరిగింది.

భూ రీ సర్వే పనుల పరిశీలన

- మాదారం, నర్సంపల్లిలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 08(ది క్రైమ్ న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియలో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో కొనసాగుతున్న సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఘట్‌కేసర్ మండలం మాదారం, కీసర మండలం నర్సంపల్లి గ్రామాల్లో జరుగుతున్న భూ రీ సర్వే పనుల తీరును పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన భూ ఆధార్ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో భూమి ఉన్న ప్రాంతాన్ని గుర్తిస్తూ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల తహసీల్దార్లు అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సర్వేయర్లు క్షేత్రస్థాయిలో చేపడుతున్న ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే జరుగుతున్న ప్రాంతాల్లో రైతులతో మాట్లాడి భూ రీ సర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. భూముల వివరాలు, హద్దులను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. భూ రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్, కీసర తహసీల్దార్ యాదగిరిరెడ్డి, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేవ్ డెమోక్రసీ నినాదంతో నిర్వహించిన చలో లోక్ భవన్ కార్యక్రమంలో గడ్డం ఇందుప్రియ

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : హైదరాబాద్, నెక్లెస్ రోడ్ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్‌లో " సేవ్ డెమోక్రసీ" నినాదంతో చలో లోక్ భవన్ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్ భవన్ వరకు నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన అవసరాన్ని నాయకులు, కార్యకర్తలు నినదించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని గడ్డం ఇందుప్రియ పేర్కొన్నారు. నిరసన కార్యక్రమం సందర్భంగా పోలీసులు పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో రాష్ట్ర మంత్రులతో పాటు గడ్డం ఇందుప్రియని కూడా పోలీసులు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మహమ్మద్ సలీం, మహమ్మద్ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ సర్పంచ్ మెండే ముత్యాలు

నల్గొండ జిల్లా ప్రతినిధి । ది క్రైమ్ న్యూస్ । అక్టోబర్ 8 పెద్దవూర: నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పెద్దవూర మండలం తుంగతుర్తి గ్రామపంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మెండే ముత్యాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ప్రజా ప్రభుత్వం ప్రజల అవసరాలు, సమస్యలను దృష్టిలో ఉంచుకుని వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోట్‌బుక్స్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచులు నక్కల నాగమ్మ, మట్టారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రావుల వేణు, ఇరుమాది శ్రీనివాస్ రెడ్డి, ఇరుమాది నర్సిరెడ్డి, దుగ్యాల రామకృష్ణ, జూపల్లి వెంకన్న, తెల్కపల్లి కృష్ణతో పాటు పార్టీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అక్రమ నాటుసారా తయారీపై ఎక్సైజ్ శాఖ దాడులు

పలు ప్రాంతాల్లో ప్రత్యేక దాడులు, తనిఖీలు నిర్వహించారు

కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గుర్తించి అక్కడి కక్కడే ధ్వంసం చేశారు

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా పరిధిలోని.ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు, కామారెడ్డి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోశెట్టి ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది. సంబంధిత అధికారులు రామారెడ్డి మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక దాడులు, తనిఖీలు నిర్వహించారు. కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కన్నాపూర్ తండా, దుబ్బ తండా, స్కూల్ తండా, జగదాంబ తండా, బట్టు తండా తదితర ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో కన్నెగూడెం తండా శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 40 లీటర్ల బెల్లం పానకం తయారీకి వినియోగించే ఎఫ్‌జే వాష్‌ను గుర్తించి, అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.అదేవిధంగా, పరిధిలోని కల్లు దుకాణాలను తనిఖీ చేసి, నాణ్యతా పరీక్షల నిమిత్తం కల్లు నమూనాలను సేకరించారు. అడ్లూర్ టీసీఎస్ డిపో, దేవునిపల్లి టీఎఫ్‌టీ దుకాణం నంబర్--4, అన్నారం టీఎఫ్‌టీ దుకాణం నంబర్--1 వద్ద కల్లు నమూనాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు.అక్రమ నాటుసారా తయారీ, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో అక్రమ మద్యం కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహిస్తామని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి జన్మదిన సందర్భంగా విద్యార్థులకు పేట్ల పంపిణీ

నల్లగొండ జిల్లా ప్రతినిధి। ది క్రైమ్ న్యూస్। అక్టోబర్ 8 తిరుమలగిరి సాగర్: నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుమలగిరి సాగర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు పేట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన పేట్లను పంపిణీ చేసి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి సంక్షేమానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సహకరించడం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ లాలు నాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ కలశం చంద్రశేఖర్ యాదవ్, తిరుమలగిరి సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆంగోత్ శీను నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కస్తూర్బా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహార భద్రత పటిష్టంగా అమలు చేయాలి

రేషన్ పంపిణీ సజావుగా సాగాలి.. అర్హులందరికీ కార్డులు అందాలి

మేడ్చల్, అక్టోబర్ 08(ది క్రైమ్ న్యూస్): జాతీయ ఆహార భద్రత చట్టం--2013ను పకడ్బందీగా అమలు చేస్తూ జిల్లాలో ఆహార భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డులు, యూనిట్ల నమోదు, నిత్యావసర సరుకుల కేటాయింపు, పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని తెలిపారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జిల్లాలో రేషన్ పంపిణీ పరిస్థితిని సమావేశంలో వివరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రెండు డివిజన్లు, 15 మండలాల పరిధిలో మొత్తం 633 చౌకధరల దుకాణాలు ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా 6,56,784 ఆహార భద్రత కార్డుల పరిధిలో 22,62,797 మంది లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి నెలా 13,905.216 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ 2025 నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కొనసాగుతోందని పేర్కొన్నారు. సమావేశానికి మల్కాజిగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరై వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని, రేషన్ ద్వారా గోధుమలు కూడా అందించాలని సూచించారు. నిర్ణీత సమయంలో రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు చౌకధరల దుకాణాలకు చేరేలా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును నిరంతరం పర్యవేక్షించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను సమర్థంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. హాస్టళ్లలో మెనూ బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని, విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యతపై అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ది క్రైమ్ న్యూస్ ఎఫెక్ట్..
కదిలిన అధికార యంత్రాంగం

నెల రోజులుగా కనిపించని గుంతలు. కథనం తర్వాత అధికారుల కంట పడింది.

'త్రివర్ణ పతాకమే దిక్కా?' కథనంతో జేసీబీలతో మరమ్మతులు షురూ.

ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు. హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు.

జమ్మికుంట నుంచి తనుగుల మీదుగా గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతపై లిలి'ది క్రైమ్ న్యూస్'లిలిలో 'రోడ్డుపై గుంతకు.. త్రివర్ణ పతాకమే దిక్కా..?' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది.కథనం వెలువడిన వెంటనే అధికార యంత్రాంగం కదిలింది. ఇన్నాళ్లు పట్టించుకోని గుంతను పూడ్చేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జేసీబీలతో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ప్రమాదం అంచున ప్రయాణించిన వాహనదారులకు ఈ చర్యతో కొంత ఊరట లభించింది. గుంతలో జాతీయ జెండాను ఉంచాల్సిన పరిస్థితిపై 'ది క్రైమ్ న్యూస్' కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా 'ది క్రైమ్ న్యూస్' ప్రచురించిన కథనానికి స్పందనగా రోడ్డు మరమ్మతులు ప్రారంభం కావడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే గుంత పూడ్చడంతో సరిపెట్టకుండా.. రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి, ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం కల్పించాలని వారు కోరుతున్నారు. ఇది కదా.. ది క్రైమ్ న్యూస్ ఎఫెక్ట్!

రైలు వస్తే క్రెడిట్... రద్దీ ఉంటే సైలెంట్!

దసరా రద్దీకి స్పెషల్ రైలు ఎక్కడ?

సెప్టెంబర్‌లో స్పెషల్.. బతుకమ్మకెందుకులేదు అసల్.

రద్దీ భారం తప్పదని తెలిసినా.. నాయకుల పలుకుబడి ఏమైంది?

ది క్రైమ్ న్యూస్ ప్రత్యేక కథనం...

తెలంగాణలో బతుకమ్మ--దసరాకు ఉన్న ప్రత్యేకతే వేరు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పండుగల సెంటిమెంట్ మరింత బలపడింది. బతుకుదెరువు కోసం హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం పండుగకు సొంతూళ్లకు చేరుకోవడం ఆనవాయితీ. ఈసారి అక్టోబర్ 10 నుంచి ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. అంటే 10వ తేదీ నుంచి స్వగ్రామాలకు వెళ్లే రద్దీ.. దసరా తర్వాత రెండు మూడు రోజుల పాటు తిరుగు ప్రయాణాల రద్దీ స్పష్టంగా కనిపిస్తోంది. మరి ఇది ఈ ప్రాంత నాయకులకు, దక్షిణ మధ్య రైల్వేకు తెలియదా? సెప్టెంబర్‌లో రైలు తెచ్చిన ఘనులు.. ఇప్పుడు ఎక్కడ?రద్దీ పెద్దగా లేని సెప్టెంబర్‌లో ప్రత్యేక రైలు నడిచినప్పుడు "మా కృషి.. మా ఒత్తిడి" అంటూ క్రెడిట్ కోసం పోటీ పడిన నాయకులు, ఇప్పుడు నిజమైన రద్దీ ముందుకొచ్చేసరికి ఎందుకు నోరు మెదపడం లేదు? బతుకమ్మ--దసరా రద్దీ కనిపించడం లేదా?రైల్వే అధికారులపై ఒత్తిడి తెచ్చి కనీసం కొన్ని ప్రత్యేక సర్వీసులైనా నడిపించాలని ఎందుకు డిమాండ్ చేయడం లేదు? ఒకవేళ ఒత్తిడి తెస్తున్నా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదా? అయితే రైల్వే ముందు వీరి పలుకుబడి ఏమైంది? సాధారణ రోజుల్లోనే రద్దీగా ఉండే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇంటర్సిటీ, కాగజ్నగర్ ఎక్స్ప్రెస్ లపై పండుగ సమయంలో మరింత భారం పడటం ఖాయం. విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, వ్యాపారులు, కుటుంబాలతో వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రానున్నది. ప్రజలకు కావాల్సింది ప్రెస్‌మీట్లు కాదు.. ప్రత్యేక రైలు. క్రెడిట్ కోసం ఫొటోలు కాదు.. ప్రయాణికులకు సౌకర్యం. సెప్టెంబర్‌లో స్పెషల్ రైలు తమ ఘనత అని చెప్పుకున్న నాయకులు.. బతుకమ్మ దసరాకు మరో స్పెషల్ రైలు తెప్పించి తమ సత్తా చూపాలి. లేకపోతే ప్రజలు అడిగే ప్రశ్న ఒక్కటే--- "రైలు వచ్చినప్పుడు మీ క్రెడిట్.. రద్దీ వచ్చినప్పుడు సైలెంటా? క్రెడిట్ కోసం ముందుండే నాయకత్వం.. ప్రయాణికుల కోసం ఎందుకు వెనక్కి తగ్గుతోంది? ఇది రైల్వే నిర్లక్ష్యమేనా.. లేక స్థానిక నాయకుల పలుకుబడి డొల్లతనమా? ఏది ఏమైనా ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లో ఈ మార్గంలో ప్రత్యేక రైళ్లు నడిస్తేనే ప్రజలు ప్రశాంతంగా ప్రయాణం సాగిస్తారు. పండగ సంతోషాలను ఆస్వాదిస్తారు.

ఎల్లమ్మ చెరువు వద్ద లింక్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు

అధికారులతో కలిసి పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీ లేక్ వ్యూ బార్ నుంచి హెచ్‌ఎంటీ శాతవాహన నగర్‌ను కలిపే ఎల్లమ్మ చెరువు వద్ద ఉన్న మట్టి రోడ్డును లింక్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. హైడ్రా, సీఎంసీ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు వద్ద సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని, ఇది చాలా కాలంగా ఉన్న సమస్య అని పేర్కొన్నారు. ప్రజలు, వాహనదారుల విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని నూతన లింక్ రోడ్డు ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నవోదయ కాలనీ నుంచి హెచ్‌ఎంటీ శాతవాహన నగర్‌కు లింక్ రోడ్డు అందుబాటులోకి వస్తే చుట్టుపక్కల కాలనీల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ఇంధనం ఆదా అవుతుందని, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి కూడా కొంత మేర తగ్గుతుందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గాంధీ అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల విస్తరణతో పాటు కొత్త లింక్ రోడ్లను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు ఎస్పీ ఆనంద్, ఏసీపీ తిరుమల్, సీఐ ముజఫర్, ఇరిగేషన్ సీఈ దేవేందర్ రెడ్డి, డీఈ అర్చన, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ శ్రీకాంతిని, ఏఈ యుగేందర్, డబ్ల్యూఐ రవి, టౌన్ ప్లానింగ్ టీపీఎస్ మచ్చేందర్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అక్తర్, జిల్లా గణేష్, పోతుల రాజేందర్, ఎండీ ఇబ్రహీం, కాశీనాథ్ యాదవ్, మజర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకుడి చెరువు కట్టపై రూ.70 లక్షలతో సీసీ రోడ్డు పనులు

మియాపూర్ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఉప్పలపాటి శ్రీకాంత్

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్త మహబూబ్‌పేట్ విలేజ్ పెద్దకుడి చెరువు కట్టపై రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సీఎంసీ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మక్త మహబూబ్‌పేట్ విలేజ్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, పనుల్లో ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తానన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికాఖురులను ఆదేశించారు. పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో ఉమ్మడి మియాపూర్ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ ఏఈ నిఖిల్, స్థానిక నాయకులు మాధవరం గోపాల్‌రావు, చందు యాదవ్, సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు జగదీష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ సకాలంలో సమాచారం అందించాలి

పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇవ్వాలి: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 08(ది క్రైమ్ న్యూస్): సమాచార హక్కు చట్టం-2005ను గౌరవిస్తూ పౌరులు కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. ప్రభుత్వ శాఖల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అన్నారు. సమాచార హక్కు వారోత్సవాలు-2026లో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం-2005 ద్వారా ప్రతి పౌరుడికి ప్రభుత్వ శాఖల నుంచి సమాచారాన్ని తెలుసుకునే హక్కు కల్పించబడిందన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని చట్ట నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి, నిర్ణీత కాలపరిమితిలో అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. సమాచారాన్ని దాచిపెట్టకుండా, చట్ట పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉన్న వివరాలను స్వచ్ఛందంగా వెల్లడించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు అధికారుల పనితీరులో జవాబుదారీతనం ఉండేలా సమాచార హక్కు చట్టం దోహదపడుతుందని తెలిపారు. ప్రతి శాఖలో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం స్వీకరించి, వాటిపై సకాలంలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పౌరులకు సరైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమాచార హక్కు చట్టంలోని నిబంధనలు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజలు కోరే సమాచారాన్ని అందించే విషయంలో నిర్లక్ష్యం చేయకుండా, చట్టపరమైన నిబంధనలను పాటించాలని అన్నారు. ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి జిల్లా అధికారులు, సిబ్బందితో సమాచార హక్కు చట్టంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని జంక్షన్లను సమగ్రంగా అధ్యయనం చేసి, అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని అన్ని ప్రధాన జంక్షన్లను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను గుర్తించి, రద్దీ నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వన్‌వే, టూ-వే విధానాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం ప్రయోగాత్మకంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ మార్పులను కనీసం ఒక వారం పాటు పరిశీలించి, ట్రాఫిక్ రాకపోకలపై వాటి ప్రభావం, ఫలితాలను అధ్యయనం చేసిన అనంతరం తగిన నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికలను నిబంధనల ప్రకారం రూపొందించి, అవసరమైన ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు, మున్సిపల్, రోడ్లు భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్లపై ఆవులు, గేదెలు, ఇతర పశువులు సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, వాటిని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పశువులను రోడ్లపైకి తీసుకురాకుండా స్థానిక సంస్థల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన మార్పులు, మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి రూపొందించే ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి అమలు వల్ల వచ్చే ఫలితాలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమీక్షలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఆర్ అండ్ బి ఈ ఈ భావ్ సింగ్, ట్రాఫిక్ పోలీసు అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రముఖ ఫార్మా కంపెనీలో ఉద్యోగావకాశాలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

75 రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు అభినందనలు

ఉద్యోగాల్లో చేరనున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించి, ప్రముఖ ఫార్మా కంపెనీలో శిక్షణ పూర్తి చేసి ఉద్యోగాల్లో చేరనున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు గ్రాన్యూల్ ఫార్మా ఇండియా లిమిటెడ్ కంపెనీలో 75 రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. త్వరలో ఉద్యోగాల్లో చేరనున్న విద్యార్థులు గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పనను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 75 రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి ఉద్యోగాల్లో చేరే స్థాయికి చేరుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి మంచి అవకాశాన్ని అందిపుచ్చుకున్న విద్యార్థులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం లభించిన ఉద్యోగావకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. పనిచేసే సంస్థకు మంచి పేరు తీసుకురావడంతో పాటు, తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు తమకు లభించిన అవకాశాన్ని మెరుగైన భవిష్యత్తుకు పునాదిగా మలుచుకోవాలని, నిరంతరం కష్టపడి పనిచేస్తూ వృత్తిపరంగా ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ అన్నారు. ఇదే విధంగా మంచి పనితీరును కొనసాగిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులకు ఇటువంటి అవకాశాలను మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు ప్రముఖ ఫార్మా సంస్థలో శిక్షణ పూర్తి చేసి ఉద్యోగాల్లో చేరడం సంతోషకరమైన విషయమని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గ్రాన్యూల్ ఫార్మా ఇండియా లిమిటెడ్‌లో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంచిరామి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషకాహార వారోత్సవాలు

గర్భిణులు, బాలింతలకు పోషక విలువలపై ప్రత్యేక అవగాహన

హాజరైన సర్పంచ్ ఉప్పు లక్ష్మి, అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి

సుల్తానాబాద్, అక్టోబర్ 08 (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల పరిధిలోని మంచిరామి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు చిన్నారుల తల్లిదండ్రులకు నిత్య జీవితంలో సమతుల ఆహారం యొక్క ప్రాధాన్యతను వివరించడానికి ఈ ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యకరమైన శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజూ అందించాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు తమ దైనందిన ఆహారంలో ఆకుకూరలు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు , పండ్లను భాగం చేసుకోవాలని, అప్పుడే పుట్టబోయే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. అనంతరం గ్రామ సర్పంచ్ శ్రీమతి ఉప్పు లక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పిల్లల్లో రక్తహీనత , పోషకాహార లోపాలను నివారించేందుకు ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతగానో తోడ్పడతాయని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. స్వాతి, పంచాయతీ కార్యదర్శి కె. రాజేష్ కుమార్, అంగన్వాడీ టీచర్లు, ఆయా వార్డుల ప్రతినిధులు, గర్భిణులు, బాలింతలు , చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలి

హెల్త్ కార్డులను పునరుద్ధరించాలి.. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించాలి - తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే హెచ్ (143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల.కు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని, హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే హెచ్ (143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. గురువారం అయన జిల్లాలోని తన స్వగ్రామం మంథని వెళ్లి హైదరాబాద్ తిరిగి వెళుతున్న సమయంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్ లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించాలన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం జర్నలిస్టు సంక్షేమ నిధిని రూ. 200ల కోట్లకు పెంచాలని, త్వరలో జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి టియుడబ్ల్యుజే మహాసభలను నిర్వహిస్తామన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ జర్నలిస్ట్ సంక్షేమ నిదికి ఇచ్చిన 42 కోట్లకు కాంగ్రెస్ మూడేండ్ల కాలం లో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు. గత ప్రభుత్వం మరణించిన జర్నలిస్ట్ కుటుంబానికి లక్ష రూపాయలు ఇచ్చిందని గుర్తు చేశారు. దాన్ని లక్ష రూపాయలు నుంచి 2 లక్షలకు రూపాయలకు పెంచి ఇస్తామని చెప్పినా ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. రెండు లక్షలకు పెంచుతామన్న హామీని అమలు చేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో హౌసింగ్ సొసైటీ ద్వారా 60% మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ గవర్నమెంట్ లో ఇంతవరకు అసలు ఇళ్ల స్థలాలు ఇప్పించలేదన్నారు. త్వరలో ఎబిఎజీ జిల్లా కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా స్థాయి సమావేశాలతో పాటు రాష్ట్ర స్థాయి మహాసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అల్లం నారాయణను జిల్లాలోని జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొట్టె సదానందం, టీయూడబ్ల్యూజే (ఐజేయుహెచ్ 143) నేషనల్ కౌన్సిల్ మెంబర్ అంకరి ప్రకాష్, కాల్వ రమేష్, నరేంద్ర చారి, శిలారపు కిషన్, కొయ్యడ తిరుపతి, తూర్పాటి శ్రీనివాస్, దొమ్మటి రాజేష్, కత్తెర్ల తిరుపతి, తిర్రి తిరుపతి, మేకల సంతోష్, కళ్యాణ్, సతీష్, తిర్రి సుధాకర్, లక్ష్మణ్, తిర్రి శంకర్, అంజయ్య, రాజు యాదవ్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సాకి చెరువు కట్టపై బతుకమ్మ వేడుకలకు భారీ ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు

సినీ, జానపద కళాకారులతో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు

సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్)పటాన్ చేరు : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పటాన్ చేరు నియోజకవర్గంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు పటాన్ చేరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) తెలిపారు. గురువారం పటాన్ చేరు లోని సాకి చెరువు కట్టపై అక్టోబర్ 18పదేనిమిదిన నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకల కోసం చేపడుతున్న ఏర్పాట్లను సైబరాబాద్ మునిసిపల్ అధికారులతో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా పటాన్ చేరు, జెపి కాలనీ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన వేలాది మంది మహిళలు సాకి చెరువు కట్టకు తరలి వస్తారని అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మహిళలు, కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక లైటింగ్, విశాలమైన పార్కింగ్, ఆకర్షణీయమైన వేదిక, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బతుకమ్మలను నిమజ్జనం చేసే ఘాట్ వద్ద భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గజ ఈతగాళ్లను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకల్లో సినీ, జానపద కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీక అని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో సాకి చెరువు కట్టకు తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి బతుకమ్మ వేడుకలను ఘనంగా, సురక్షితంగా, పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు. సాకి చెరువుతోపాటు బండలగూడ, రామచంద్రాపురం, అమీన్పూర్, బీరంగూడ, తెల్లాపూర్, ముత్తంగి, బొల్లారం పరిధిలోని బతుకమ్మ ఘాట్లను సైతం సద్దుల బతుకమ్మ పండుగకు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పటాన్ చేరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, డిఈ కృష్ణవేణి, ఏఈలు లావణ్య, ఫైజన్, తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లిలో 'నేను కలలుగన్న భారత్' పోటీలు

63 మంది విద్యార్థుల ప్రతిభ.. విజేతలకు బహుమతులు...

కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్) కొంపల్లి, అక్టోబరు 8: సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా కొంపల్లిలోని సియోలం గ్రామర్ పాఠశాల విద్యార్థులకు 'నేను కలలుగన్న భారత్' అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కొంపల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్ధుల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 63 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, వికసిత్ భారత్--2047 సంకల్పాన్ని భావితరాలకు చేరవేయడంలో భాగంగానే ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు దేశంపై తమ ప్రేమ, బాధ్యతను చాటుతూ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ముఖ్య అతిథి, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు దేశ భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయన్నారు. భవిష్యత్తులో విదేశాల్లో స్థిరపడినా భారతావనిని మరవొద్దని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సరితరావు, శంకర్ నాయక్, మాధురి, మహేందర్ సాగర్, దుర్గా, నరసింహ, అశోక్, శ్రీకాంత్ గౌడ్, లక్ష్మణ్, ఆస్కాని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార భద్రతతోనే ఆరోగ్య సమాజం

మహిళల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించాలి

గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి

సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్)పటాన్ చేరు : మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి, సమతుల్య ఆహారంపై అవగాహన పెంపొందించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని పటాన్ చేరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్ చేరు డివిజన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్--పోషణ మాసం వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలకు అందిస్తున్న పోషకాహార సేవలు, ఆరోగ్య కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన కుటుంబానికి మహిళల ఆరోగ్యం పునాది వంటిదని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోషకాహార లోపం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, అందువల్ల చిన్నారులకు చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పండ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిలో పోషకాహారంపై అవగాహన పెరిగితేనే సమాజంలో ఆరోగ్యకరమైన మార్పు సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. పోషణ్ అభియాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై గ్రామాలు, కాలనీల్లో మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఓ జయరాం నాయక్, ఎంఈఓ నాగేశ్వరరావు నాయక్, రామ్మోహన్, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

యాక్సిడెంట్ అయ్యింది.. కోలుకుంటున్నా

ఇన్స్‌టాలో పోస్ట్ పెట్టిన నటి రష్మిక మందన్నా

సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే...నటి రష్మిక మందన్నా ఈ మధ్య ఎక్కువగా కనిపించడం లేదు. ఆమెపై ఎలాంటి వార్తలు వినిపించలేదు. ఈక్రమంలో తాజాగా రష్మిక మంధన్నానే ముందుకు వచ్చి అసలు విషయాన్ని వెల్లడించింది. గత నెల రోజులుగా నేను యాక్టివ్‌గా లేను. గత నెలలో నాకు యాక్సిడెంట్ అయ్యింది ఇప్పుడు కోలుకున్నాను అంటూ తన ఇన్స్టాలో పోస్ట్ పెట్టింది. ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు ఇంట్లోనే ఉంటున్నానని, త్వరలోనే మళ్లీ షూటింగ్స్ కు హాజరవుతానని రష్మిక తెలిపింది. అంతేకగాక జీవితం చాలా విలువైనది. జాగ్రత్తగా ఉండండి. రేపనేది ఉంటుందో లేదో తెలీదు. హ్యాపీగా జీవించండిస అంటూ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. ఇప్పుడీ పోస్టు సామాజిక మాద్యమాల్లో బాగా వైరల్ అవుతుంది. ఇదిలాఉండగా అసలు ప్రమాదం ఎలా జరగింది, షూటింగ్‌లో అయిందా లేక ట్రావెలింగ్‌లో ఏమైనా అయిందా అనే విషయాన్ని చెప్పలేదు. రష్మిక స్పీదుగా కోలుకోవాలని ఆమె అభిమానులు ప్రార్దిస్తున్నారు. ఇక రష్మిక నటించిన పుష్ప2, కుబేర సినిమాలు ఈ డిసెంబర్‌లో విడుదలవనుండగా సల్మాన్‌ఖాన్‌తో చేస్తున్న బాలీవుడ్ చిత్రం సికిందర్ వచ్చే సంవత్సరం రంజాన్‌కు రిలీజ్ కానుంది. ఇవిగాక రెయిన్ బో, ది గర్ల్‌ఫ్రెండ్ అనే రెండు తెలుగులో చిత్రాల్లో ప్రస్తుతం రష్మిక నటిస్తోంది.

అక్షర హాసన్‌తో తనూజ్ వీర్వాణి బ్రేకప్

ప్రైవేట్ ఫోటోలు లీకే కారణమని పుకార్లు

కమల్ హాసన్ కుమార్తె అక్షర హాసన్‌తో నాలుగేళు డేటింగ్‌లో ఉన్న తర్వాత బాలీవుడ్ నటుడు తనూజ్ వీర్వాణి ఆమెకు బ్రేకప్ చెప్పారు. తాజాగా వీరి బ్రేకప్‌కు గల కారణాన్ని ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. గతంలో అక్షర హాసన్ ప్రైవేట్ ఫొటోలు ఆన్‌లైన్‌లో లీక్ కావడంపై స్పందించారు. బ్రేకప్ అయిన తర్వాత కూడా నేను అక్షరతో మాట్లాడుతూనే ఉన్నాను. ప్రేమలో ఉన్న వ్యక్తులు పరస్పరం ఒకరినొకరు గౌరవించు కోవాలి. ఒకరికోసం ఒకరు అండగా నిలబడాలి. మా ఇద్దరికీ ఆ విషయంలో విభేదాలు వచ్చాయి. అందుకే విడిపోయాం. ఆమె ప్రైవేటు ఫొటోలు లీక్ అయిన కారణంగా నేను బ్రేకప్ చెప్పలేదు. కానీ.. ఆ వివాదం తర్వాత మా ఇద్దరికీ దూరం పెరిగింది. అవి నా కారణంగా లీక్ అయ్యాయని ఆమె భావించింది. అందుకే అవసరం ఉన్నప్పుడు ఆమె నాకు అండగా నిలబడలేకపోయింది. ఈ విషయంలో నేను ఆమెను నిందించాలని అనుకోవడం లేదు.. ఎందుకంటే ఎవరి కారణాలు వాళ్లకు ఉంటాయని చెప్పారు. గతంలోనూ ఈ విషయంపై తనూజ్ మాట్లాడారు. 'నేను అక్షర ప్రైవేటు ఫొటోలు లీక్ చేసినట్లు ఎన్నో పత్రికల్లో రాశారు. ఈ విషయాన్ని ఆమె ఖండించలేకపోయింది. వ్యక్తిగతంగా నన్ను నమ్మినప్పటికీ బయట ప్రపంచానికి మాత్రం నా తప్పులేదని ఒక్క ప్రకటన కూడా ఇవ్వలేకపోయింది. ఆ విషయంలో ఎంతో బాధపడ్డాను. అక్షర ఫొటోలు లీక్ అవ్వడంపై నిజం ఎప్పటికైనా బయటకు వస్తుందని నమ్ముతున్నానని తనూజ్ వీర్వాణి వివరించారు.

క్రిస్మస్‌కు విడుదల కానున్న బేబీ జాన్

నేషనల్ అవార్డు విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేశ్ బీటౌన్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం బేబీ జాన్ బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధవన్ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ సినిమాను డిసెంబర్ 25న ప్రపంచవాప్తంగా క్రిస్మస్ కానుకగా థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ మూవీలో వరుణ్ ధవన్ ఇదివరకెన్నడూ చూడనటువంటి అద్భుతమైన పాత్రలో కనిపించబోతున్నాడంటున్నారు నిర్మాత జ్యోతి దేశ్‌పాండే. వరుణ్ ధవన్ స్టన్నింగ్ పర్‌ఫార్మెన్స్ ఇచ్చాడని.. బేబీ జాన్ ప్రతీ ఒక్కరీ మనసు దోచేస్తున్నారు. అంతేకాదు ఈ సినిమాకు ఫ్రాంఛైజీగా కూడా మారొచ్చన్నారు. ఇది సీక్వెల్ కాదని.. పాత్ర ఆధారంగా సాగే ఫ్రాంఛైజీ అని చెప్పుకొచ్చారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలపై క్లారిటీ రావడానికి మరికొన్ని నెలలు పడుతుందని చెప్పారు. ఇప్పుడీ మాటలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ మూవీలో కీర్తిసురేశ్ వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. వామికా గబ్బి మరో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా.. సినీ1 స్టూడియోస్, జియో స్టూడియోస్‌తో కలిసి ప్రియాఅట్లీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బేబీజాన్ కీర్తిసురేశ్ బాలీవుడ్ డెబ్యూ సినిమా కావడం విశేషం. ఇందులో సల్మాన్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు.





చిత్రీకరణ ముగింపులో రాజసాబ్

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రీకరణ పరుగులు పెడుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసరాల్లో ప్రభాస్, కథానాయికలు, కొద్దిమంది హాస్యనటులపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. మారుతి దర్శకత్వంలో టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రమిది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్‌తోపాటు మరో కథానాయిక ఇందులో నటిస్తోంది. హారర్ అంశాలతో కూడిన రొమాంటిక్ చిత్రమిది. ప్రభాస్ స్టైలిష్ అవతారంలో సందడి చేయనున్నారు. ప్రభాస్ చేతిలో చాలా సినిమాలే ఉన్నా, కొంతకాలంగా 'రాజా సాబ్' సినిమాపైనే దృష్టి కేంద్రీకరించారు. దాంతో సినిమా శరవేగంగా సాగుతోంది. వచ్చే వేసవి సందర్భంగా ఏప్రిల్ 10న ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. ప్రభాస్ సినిమాలకు తగ్గట్టుగానే భారీ హంగులతో 'రాజాసాబ్' రూపొందుతోంది. తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు.

27న విడుదలకు సిద్ధంగా దేవర

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దేవర' భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే పాటలతో పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ సినిమా తాజాగా మరో ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఇటీవల ఓవర్సీస్‌లో దీని ప్రీసేల్ టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోన్న ఈ సినిమా ట్రైలర్ నేడు విడుదల కానుంది. ఇది రిలీజ్ కావడానికి ముందే ఓవర్సీస్‌లో ప్రీసేల్ బుకింగ్‌తో మిలియన్ డాలర్ల మార్క్‌ను చేరుకుంది. దీంతో నార్త్ అమెరికన్ బాక్సాఫీస్‌లో అత్యంత వేగంగా టికెట్ల ప్రీసేల్ ద్వారానే వన్ మిలియన్ డాలర్ల మార్క్‌ను చేరిన సినిమాగా 'దేవర' నిలిచింది. ట్రైలర్ కూడా రిలీజ్ కాకముందే ఈ ఘనత సాధించిన మొదటి భారతీయ చిత్రంగా రికార్డు నెలకొల్పింది. దీంతో ఎన్టీఆర్ అభిమానులు సంబరపడుతున్నారు. ట్రైలర్ రిలీజ్ అయ్యాక ఈ సంఖ్య మరింత పెరిగి మరిన్ని రికార్డులు నెలకొల్పే అవకాశముందని అనుకుంటున్నారు. ముంబయిలో 'దేవర' ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతున్నాయి. ఎన్టీఆర్, జాన్వీకపూర్, సైఫ్ అలీఖాన్‌లు వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొని సినిమా విశేషాలు పంచుకుంటున్నారు. ఈ సినిమాతో జాన్వీ కపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంత నేపథ్య కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. రెండు భాగాలుగా ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.

సల్మాన్ సికిందర్‌లో కాజల్ అగర్వాల్

బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. సికిందర్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తెలిసిందే. తాజాగా ఈ మూవీలో మరో భామ కూడా చేరిపోయింది. ఇంతకీ ఎవరా బ్యూటీ అనుకుంటున్నారా..? టాలీవుడ్ కలువ కండ్ల సుందరి కాజల్ అగర్వాల్ మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నట్టు వచ్చిన వార్తలు నిజమయ్యాయి. సికిందర్ టీంలోకి కాజల్‌కు స్వాగతం పలుకుతూ.. సెట్స్‌లో జాయిన్ అయిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. మరి మురుగదాస్ ఈ ఇద్దరు భామలను ఎలాంటి పాత్రల్లో చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో సికిందర్ ఉండబోతుందని బీటౌన్ సర్కిల్ సమాచారం. ఓ వైపు ఎమోషన్స్‌ను హైలెట్ చేస్తూనే.. మరోవైపు హై ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్‌తో సికిందర్ సాగనుందట. ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్ సత్యరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.

vPrinted, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056